ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 33.0
కనిష్ఠం : 19.0

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
మంగళవారం 23 జనవరి 2024



ఏలూరులో బస్సులో అంగన్‌వాడీల నినాదాలు

అంగన్‌వాడీలపై ఉక్కుపాదం



కైకలూరు సీఎన్నార్ గార్డెన్లో నిర్బంధించిన అంగన్వాడీ టీచర్లు, ఆయాలు

అంగన్‌వాడీలపై జగన్ సర్కార్ ఉక్కుపాదం మోపింది. సీఎం క్యాంపు కార్యాలయ ముట్టడికి సోమవారం 'ఛలో విజయవాడ'కు పిలుపునిచ్చిన అంగన్‌వాడీలపై పోలీసులు విరుచుకు పడ్డారు. ఆదివారం రాత్రి నుంచి అరెస్టులతో భయభ్రాంతులకు గురి చేశారు. జిల్లావ్యాప్తంగా 639 మందిని అరెస్ట్ చేసి పోలీసు స్టేషన్‌లకు తీసుకొచ్చి వారికి నరకం చూపించారు. మరోవైపు విధుల్లో చేరలేదంటూ 2,500 మందిని తొలగిస్తూ తొలుత జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అయితే సోమవారం అర్ధరాత్రి ప్రభుత్వం దిగివచ్చింది. అంగన్‌వాడీల డిమాండ్లకు అంగీకారం తెలిపింది. దీంతో సమ్మె విరమిస్తున్నట్టు యూనియన్ నాయకులు ప్రకటించారు.

ఏలూరు/క్రైం/టూ టౌన్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలు 41 రోజులుగా తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్నారు. జిల్లాలో వీరంతా సమ్మెబాట పట్టారు. ఇప్పటికే ఎస్మా కింద జిల్లాలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు నోటీసులు జారీచేశారు. ఎస్మా నోటీసులను లెక్క చేయకుండా పట్టు వీడని విక్రమార్కుడిలా ఆయాలు, కార్యకర్తలు సమ్మెలోనే ఉన్నారు. సోమవారం సీఎం క్యాంపు కార్యాలయం ముట్టడికి 'ఛలో విజయవాడ' ఆందోళనకు పిలుపునిచ్చారు. దీనిని విఫలం చేసేందుకు పోలీసులు 21వ తేదీ మధ్యాహ్నం నుంచే రంగంలోకి దిగారు. ముఖ్య నాయకులు, ప్రజా సంఘ నాయకులకు నోటీసులు జారీచేశారు. ఆదివారం సాయంత్రం నుంచి జిల్లావ్యాప్తంగా అన్నిప్రధాన రహదారుల్లోనూ వాహనాల తనిఖీలు చేపట్టారు. చేబ్రోలు పోలీస్ స్టేషన్ పరిధిలోని కైకరం సెంటర్, భీమడోలు, దెందులూరు పోలీస్ స్టేషన్ల పరిధిలోని భీమడోలు సెంటర్‌లో పోలీసులు జాతీయ రహదారిపై విస్తృతంగా వాహనాల తనిఖీలు చేశారు. కలపర్రు టోల్‌గేటు వద్ద పెదపాడు పోలీసులు తనిఖీలు చేశారు. బస్సుల్లో మహిళా ప్రయాణీకులను తమదైన శైలిలో ప్రశ్నలతో వివరాలు రాబట్టారు. అనుమానం కల్గిన వారిని అక్కడికక్కడే దించి పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఏలూరు నగరంలో ఎస్పీ మేరీ ప్రశాంతి రైల్వే స్టేషన్‌లో, కొత్త బస్టాండ్‌లో పరిశీలన చేశారు. డీఎస్పీ ఈ శ్రీనివాసులు పాతబస్టాండ్ వద్ద తన సిబ్బందితో బస్సులు ఎక్కే మహిళా ప్రయాణీకులతో మాట్లాడారు. అనుమానం కల్గిన వారిని దించేశారు. ఏలూరు వన్‌టౌన్‌లో 10 మందిని, టూ టౌన్‌లో 38 మందిని, త్రీ టౌన్‌లో 35 మందిని, రూరల్‌లో 14 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఏలూరు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో అదుపులోకి తీసుకున్న అంగన్‌వాడీలకు పచ్చి మంచినీళ్ళు కూడా ఇవ్వకుండా నరకం చూపించారు. పచ్చి మంచినీళ్ళు కూడా అందించలేదు. జిల్లావ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ముందస్తు అరెస్టులు చేశారు. సీఆర్‌పీసీ 151 కింద జిల్లావ్యాప్తంగా 639 మందిని ముందస్తు అదుపులోకి తీసుకుని వ్యక్తిగత పూచీ కత్తులపై సోమ వారం సాయంత్రం విడిచి పెట్టారు. వివిధ దూర ప్రాంతాల్లో ఉన్న వారిని పోలీసులే స్వయంగా తీసుకువెళ్ళి రైళ్ళు ఎక్కించారు. మరికొంత మందిని బస్సులు ఎక్కించి పంపించి వేశారు.



ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అల్లూరి సీతారామరాజు జిల్లా రొంపచోడవరం మండలం బోలగండకు చెందిన అంగన్‌వాడీ కె.వి.రామలక్ష్మి

ఏలూరులో మరింత ఉద్రిక్తత నెలకొంది. అంగ న్వాడీల అడ్డగింత, అరెస్టులపై వామపక్షాలు సోమవారం ఉదయం నుంచి నగరంలోని పలుచోట్ల రాస్తారోకోలు, ధర్నాలకు పిలుపునిచ్చారు. విజయవాడ, శ్రీకాకుళం, విజయనగరం తదితర ప్రాంతాలకు చెందిన 70 మంది అంగన్వాడీలను విజయవాడ నుంచి 50 మంది సామర్థ్యం గల ఒక బస్సులో కుక్కి ఏలూరు తీసుకొచ్చారు. కొత్తబస్టాండ్ వద్ద వారిని ఎండలో కూర్చోబెట్టి పోలీసులు ముప్పతిప్పలు పెట్టారు. అంగన్వాడీలు ఎదురు తిరగడంతో పెదవేగి తరలించే క్రమంలో ఫైర్‌స్టేషన్ వద్ద అప్పటికే రాస్తారోకో చేస్తున్న కార్మిక సంఘాలు గుర్తించి బస్సును అడ్డుకున్నారు. బస్సు నుంచి దిగుతున్న అంగన్వాడీలను నిలువరించాలని పోలీసులు ప్రయత్నించినా ఆపలేకపోయారు. చాలాసేపు వామపక్షాలతో కలిసి అక్కడే రాస్తారోకో నిర్వహించారు. 24 గంటల నుంచి సరైన తిండి, నీరు లేక అంగన్వాడీలు నీరసించిపోయారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు మేము వెనుదిరిగి ఇళ్లకు వెళ్లేది లేదని మరలా మమ్మల్ని విజయవాడ తరలించమని డిమాండ్ చేశారు. ధర్నా చేసిన వారంతా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల నుంచి వచ్చిన వారు.

అర్ధాకలితో నరకం చూశారు

పెదవేగి : వివిధ ప్రాంతాల నుంచి విజయవాడ వెళ్తున్న అంగన్‌వాడీలను గుర్తించి, కొంతమందిని పెదవేగిలోని జిల్లా పోలీస్ శిక్షణా కేంద్రానికి(డీటీసీ) తరలించారు. ఏలూరు, పెదవేగి, పెదపాడు, బుట్టాయిగూడెం, పోలవరం, దెందులూరు తదితర ప్రాంతాలతో పాటు అల్లూరి సీతారామరాజు జిల్లా, విజయనగరం తదితర ప్రాంతాలకు చెందిన సుమారు 500లకు పైగా అంగన్‌వాడీలను డీటీసీలోకి తీసుకెళ్లిన పోలీసులు వారికి ఆహారం అందించడంలో విఫలమయ్యారు. ఉదయం ఉప్మా చేయించిన అధికారులు 500 మందిలో ఓ 200 మందికి అందించగా, తక్కిన వారు పస్తులున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు మరో 300 మందికి భోజనాలు ఏర్పాటుచేయగా, మిగిలిన 200 మంది ఆకలి తీర్చుకునే దారి కోసం అలమటించారు. తమను పరామర్శించడానికి వచ్చిన వామపక్షాల నేతల దగ్గర అంగన్‌వాడీలు ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలను బలవంతంగా అరెస్టు చేసి, కనీసం భోజనం కూడా పెట్టకపోవడం సిగ్గు చేటని సీపీఎం, సీపీఐ నేతలు ఏ.రవి, ఎం.కృష్ణచైతన్య ఆగ్రహం వ్యక్తం చేశారు.



కలపర్రు జాతీయ రహదారిపై పోలీసుల అదుపులో..

చలో విజయవాడకు అడ్డగింతలు

- సమస్యల పరిష్కారానికి 42 రోజులుగా ఆందోళనలు
- సీఎం క్యాంపు కార్యాలయం ముట్టడికి చలో విజయవాడ పిలుపు
- ఎక్కడికక్కడ తనిఖీలు.. అరెస్టులతో పోలీసుల నిర్బంధం
- కనీసం మంచినీళ్లు ఇవ్వలేదు..
- నిలువరించిన వామపక్షాలు.. ధర్నాలతో దద్దరిల్లిన ఏలూరు
- ఒకే బస్సులో 70 మందిని కుక్కి పంపిన పోలీసులు
- పెదవేగి డీటీసీలో 200 మందికి పైగా ఆకలి మంటలు
- కైకలూరులో 800 మంది నిర్బంధం.. పోలీసుల అత్యుత్సాహం
- కార్యకర్తల నినాదాలు విన్పించకుండా మైక్ ద్వారా శ్రీరాముని పాటలు
- మీడియాను అడ్డుకున్న పోలీసులు.. టీడీపీ నేతల నిరసన
- అర్ధరాత్రి దిగొచ్చిన ప్రభుత్వం.. అంగన్‌వాడీల డిమాండ్లకు అంగీకారం



ఏలూరు ఫైర్ స్టేషన్ సెంటర్‌లో అంగన్‌వాడీల ధర్నా



అంగన్‌వాడీ కార్యకర్తలను కలపర్రు టోల్‌గేట్ వద్ద అడ్డుకున్న పోలీసులు



పోలవరం పోలీస్ స్టేషన్ వద్ద అంగన్వాడీలు నినాదాలు

ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకుని స్థానిక అంగన్‌వాడీలను, వివిధ సంఘాల నాయకులను టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విజయవాడ నుంచి తరలించిన వారిని తిరిగి అదే బస్సులో పెదవేగి పోలీసు అకాడమికి తరలించి సాయంత్రం అక్కడ విడిచిపెట్టారు. విడుదల చేసిన అంగన్వాడీ కార్యకర్తలను విజయవాడ తీసుకెళ్తామని చెప్పి ఏలూరు ఆశ్రం ఆస్పత్రి నుంచి రాజమండ్రి తీసుకెళ్లడానికి ప్రయత్నించగా అంగన్వాడీలు ప్రతిఘటించి ఆశ్రం ఆస్పత్రి వద్ద ఆందోళన నిర్వహించారు. అదుపులోకి తీసుకున్న యూనియన్ నాయకులు 13 మందిని విడుదల చేయలేదు. వీరిని పెదవేగి, దెందులూరు పోలీస్‌స్టేషన్లకు తిప్పుతున్నారు. వీరిలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు రవీంద్రనాథ్ తదితరులు ఉన్నారు.

500 మంది నిర్బంధం

నూజివీడు : వివిధ ప్రాంతాల నుంచి విజయవాడకు చేరుకున్న అంగన్‌వాడీలను విజయవాడ నుంచి ఆర్టీసీ బస్సుల్లో వివిధ ప్రాంతాలకు తరలించారు. నూజివీడు సారథి ఇంజినీరింగ్ కళాశాలకు మొత్తం ఎనిమిది బస్సుల్లో 500 మంది అంగన్‌వాడీలను తరలించి నిర్బంధంలో ఉంచారు. బస్సుల్లో కనీసం మంచినీళ్లు ఇవ్వలేదని, మూత్ర విసర్జనకు అనుమతించకుండా అమా నుషంగా ప్రవర్తించారని వారు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఐటీయూ నూజివీడు అధ్యక్ష కార్యదర్శులు ఎన్ఆర్ హనుమాన్లు, జి.రాజు, శోభ నాద్రి, సీపీఐ నాయకులు చలసాని వెంకటరామారావు, కొమ్మన నాగేశ్వరరావు, చాట్ల పుల్లారావు, ఇంజినీరింగ్ కళాశాలకు చేరుకుని అంగన్‌వాడీలకు సంఘీభావం తెలిపారు. నూజివీడు టీడీపీ ఇన్‌చార్జ్ ముద్దర బోయిన వెంకటేశ్వరరావు అంగన్‌వాడీలకు సంఘీభావం తెలిపేందుకు రాగా పోలీసులు కళాశాల బయటే నిలిపి వేశారు. అదే సమ యంలో వస్తున్న అంగన్‌వాడీలు ఆయనతో మాట్లాడుతూ ఉదయం 6 గంటలకు బస్సు ఎక్కించి గన్నవరం, బాపుల పాడు, ఆగిరిపల్లి తీసుకొచ్చారని అక్కడ పోలీస్‌స్టేషన్‌లలో ఖాళీగా లేవని, చివరికి నూజివీడుకు తీసుకొచ్చారని వివ రించారు. కళాశాల ప్రాంగణంలో అంగన్‌వాడీలు ధర్నాకు దిగారు. సాయంత్రం వారిని అక్కడ నుంచి పంపివేశారు.

15 బస్సుల్లో తరలింపు

కైకలూరు : విజయవాడ చేరుకున్న అంగన్వాడీ టీచర్లు, ఆయాలను సుమారు 800 మందిని సుమారు 15 బస్సుల్లో కైకలూరు సీఎన్నార్ గార్డెన్‌కు తెల్లవారుజామున 3గంటల ప్రాంతంలో తీసుకొచ్చి నిర్బంధించారు. చిత్తూరు, తిరుపతి, అనంతపురం, నెల్లూరు, ఉభయగోదావరి, కోనసీమ, కృష్ణా జిల్లాల నుంచి అంగన్వాడీ టీచర్లు, ఆయాలను తీసు కొచ్చి మంచులోనే సీఎన్నార్ గార్డెన్ బయట వదిలేసి గేట్ల కు తాళాలు వేసి నిర్బంధించారు. ఈ సంగతి బయటకు పొక్కకుండా పోలీసులు అయోధ్యలో బాల రాముని ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరిం చుకొని మైక్ ఏర్పాటు చేసి భక్తి గీతాలు విన్పిస్తూ మభ్య పెట్టే ప్రయత్నాలు చేశారు. కనీసం మంచినీరు, తినేందుకు ఆహారం వారికి ఇవ్వకుండా మధ్యాహ్నం వరకు కూర్చోబెట్టారు. ఈ సమాచారం మీడియాకు అంది అక్కడ వెళ్లగా కైకలూరు టౌన్ సీఐ ఆకుల రఘు ఆదేశాలతో సిబ్బంది గేటు వద్దే ఆపే శారు. ఈ తరుణంలో విలేకర్లకు, పోలీసులకు వాగ్వాదం జరిగింది. కైకలూరు టీడీపీ నేతలు పెద్ద ఎత్తున సీఎన్నార్ గార్డెన్‌కు తరలివచ్చి పోలీసులను ప్రశ్నించారు. కొంత మం ది అంగన్‌వాడీలు పోలీసులను నెట్టుకుంటూ గేటు వద్దకు వచ్చి తాము ఏయే ప్రాంతాల నుంచి వచ్చామో ఏ సమ యంలో తీసుకువచ్చారో మీడియాకు, టీడీపీ నేతలకు వివరించారు. కనీసం మంచినీటి సౌకర్యం కల్పించలేదని 800 మంది కార్యకర్తల్లో అనేక మంది షుగరు, బీపీలతో బాధపడుతున్నా మని గంటల తరబడి మంచులో వదిలి వేసి పోలీసులు నియంతలాగా వ్యవహరిస్తున్నారని ఆవే దన వ్యక్తం చేశా రు. ఇదే సమ యంలో మరికొంత మంది పోలీసులను గేటు వద్ద బందోబస్తు పెట్టడంతో టీడీపీ నేతలంతా గేటు వద్ద ఆందోళన చేశారు. కొద్దిసేపటికి పోలీసులు చాలీచాలని టిఫిన్‌లను అంగన్‌వాడీలను అందించారు. సాయంత్రం అంగన్‌వాడీలను తీసుకొచ్చిన బస్సుల్లోనే విజయవాడకు తరలించారు.

మహిళలే టాప్

ఏలూరు జిల్లాలో మొత్తం ఓటర్లు 16,24,416

- పురుషులు 7,93,897, మహిళలు 8,30,390
- ముసాయిదా కంటే పెరిగిన 35,794 ఓటర్లు : కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్



ఏలూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): 'ఓటర్ల జాబితాలో అనుమానాలు ఉంటే ప్రశ్నించమని మీటింగ్ పెట్టిన ప్రతిసారి రాజకీయ పార్టీల నాయకులను ప్రశ్నిస్తున్నా. ఎన్నిసార్లు అడిగినా ఎవరూ అడగకపోతే మేం చేయగలిగిందేమీ లేదు' అని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ పేర్కొన్నారు. 2024 జనవరి ఒకటో తేదీ నాటికి నమోదైన వివరాల ప్రకారం తుది ఓటర్ల జాబితాను కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. 'ఏలూరు జిల్లాలో 2023 అక్టోబర్ 27 నుంచి జరిగిన ఓటర్ల జాబితా సవరణలో ఓటర్ల నుంచి 1,93,870 దరఖాస్తులు వచ్చాయి. ఫారం-6 ద్వారా 95 వేల 943 దరఖాస్తులను పరిశీలించి 93 వేల 018 మంది ఓటర్లుగా గుర్తించాం. అనర్హత కలిగిన 2,925 దరఖాస్తులను తిరస్కరించాం. 18-19 ఏళ్ల యువకులు 27,412 మందిని ఓటరు జాబితాలో చేర్చాం. ఫారం-7 ద్వారా 60,875 మంది అభ్యంతరాలు వ్యక్తం చేశారు. వీటిలో 57,224 దరఖాస్తులను పరిష్కరించి, 27,347 మంది చనిపోయిన వారి ఓట్లను తొలగించాం. 21,094 మంది శాశ్వత వలసదారులకు గాను 7,793 డూప్లికేట్ తదితర దరఖాస్తులను పరిష్కరించాం. మూడు నెలల క్రితం విడుదల చేసిన ముసాయిదా జాబితా ప్రకారం 15,88,622 మంది ఓటర్లలో పురుషులు 7,78,884, మహిళలు 8,09,615 మంది, థర్డ్ జండర్లు 123 మంది ఉన్నారు. తుది జాబితాకు వచ్చే సరికి 16 లక్షల 24 వేల 416 మంది ఓటర్లు నమోదయ్యారు. వీరిలో పురుషులు 7,93,897 మంది, మహిళలు 8,30,390 మంది, థర్డ్ జండర్ 129 మంది ఉన్నారు. ముసాయిదా జాబితాకంటే 35,794 మంది ఓటర్లతో 0.98 శాతం పెరుగుదల కనిపించింది. పురుషులకంటే 36 వేల 493 మంది మహిళలు అధిక సంఖ్యలో ఓటర్లుగా నమోదయ్యారు. రాజకీయ పార్టీల నుంచి 29 వేల 949 ఫిర్యాదులందగా, అందులో పరిగణనలోకి తీసుకోవాల్సిన ఫిర్యాదులు 21,878 మాత్రమే ఉన్నాయి. వైసీపీ నుంచి అందిన వాటిల్లో డబుల్ ఎంట్రీలు ఉండటం వల్ల ఆ సంఖ్య మరింత ఎక్కువగా కనిపిస్తుందే తప్ప ఫిర్యాదుల రూపేణా వచ్చినవి నిజం కావు. టీడీపీ తరపు నుంచి అందిన ఫిర్యాదులు నిర్ణీత కాలం కంటే ఆలస్యంగా అందాయి. జిల్లాకు చెందిన పలువురు ఇతర ప్రాంతాల్లో చదువుకుంటూ ఇక్కడ ఓటరు కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నారు. వారు ఆలస్యంగా నమోదు చేసుకోవడం వల్ల ప్రస్తుత జాబితాలో వారి పేర్లు నమోదు చేయలేదు. త్వరలోనే ఇవి నమోదు చేస్తాం' అని కలెక్టర్ వివరించారు.

బీఎల్వోల తప్పు లేదు

జీరో డోర్ నెంబర్ల వ్యవహారంలో పలువురు ఓటర్లు తమ దరఖాస్తుల్లో చిరునామాలకు బదులు జీరోలు నమోదు చేశారు. పాత ఆధార్ కార్డుల్లో మారిన కొత్త చిరునామాలు లేని కారణంగా అలా జరిగింది. దరఖాస్తుదారులు ఓటును కోల్పోతారేమోనన్న భావించి బీఎల్వోలు మంజూరు చేసేశారు. అందువల్లే జీరో డోర్ నెంబర్లు తలెత్తాయే తప్ప ఎలాంటి పొరపాట్లు జరగలేదు. డబుల్ ఎంట్రీలు, ఒకే డోర్ నెంబర్లపై అధిక సంఖ్యలో మురికివాడలు, చిన్నస్థాయి గుడిసెలు, రేకుల ఇళ్లల్లో వరుసగా ఒకే డోర్ నెంబర్‌పై ఉండటం వల్లే ఇలాంటి సమస్యలు తలెత్తాయి. పదికి మించి నమోదైన 39,617 ఓట్లపై ఫిర్యాదులు రాగా, 39,582 పరిష్కరించాం. జంగారెడ్డిగూడెం పరిధిలో మరణించిన 27 ఓట్ల తొలగింపుపై ఫిర్యాదులు అందినా నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించిన ముగ్గురు బీఎల్వోలను తొలగించాం. తుది జాబితాలపై ఏమైనా అభ్యంతరాలు వుంటే తహసీల్దార్, ఈఆర్వోల దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరించుకోవచ్చు. జాబితాలను తహసీల్దార్, ఈఆర్వో, పోలింగ్ బూత్‌ల వద్ద అందుబాటులో ఉంచుతున్నాం' అని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ తెలిపారు.

ఓటర్ల జాబితా

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం	పెరిగిన ఓటర్లు	శాతం
చింతలపూడి	1,33,747	1,37,714	41	2,71,502	5626	0.98
పోలవరం	1,22,201	1,30,380	11	2,52,592	8279	0.97
నూజివీడు	1,17,398	1,19,730	11	2,37,139	3944	0.98
ఏలూరు	1,10,254	1,20,423	47	2,30,724	7286	0.97
దెందులూరు	1,08,465	1,14,305	7	2,22,777	1476	0.99
ఉంగుటూరు	1,01,152	1,04,177	5	2,05,334	3985	0.98
కైకలూరు	1,00,680	1,03,661	7	2,04,348	5198	0.97



• జై.జై..శ్రీరామ్

అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రతిష్ఠ నేపథ్యంలో జిల్లాలో పండుగ వాతావరణం నెలకొంది. రామాలయాలు, ఆంజనేయస్వామి మందిరాలు జై శ్రీరామ్ అంటూ మార్మోగాయి. ప్రత్యేక పూజలు నిర్వహించారు. శోభాయాత్రలు నిర్వహించారు. అయోధ్య కార్యక్రమాన్ని వీక్షించేందుకు పలుచోట్ల ఎల్ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. ఏలూరు రామకోటి మందిరంలో పూజలందుకున్న స్వామివారు, అమ్మవార్లను పై చిత్రంలో చూడవచ్చు.

స్పందనలో 197 అర్జీల స్వీకరణ

ఏలూరు కలెక్టరేట్, జనవరి 22 : జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో అందిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందనలో 197 అర్జీలను స్వీకరించారు. జేసీ బి.లావణ్యవేణి, ఐటీడీఏ పీవో సూర్యతేజ, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ శ్రీపూజ, డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, ఆర్డీవో ఖాజావలీ అర్జీలు స్వీకరించారు.

కలెక్టర్‌ను కలిసిన అధికారులు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుంచి జిల్లాకు బదిలీ అయిన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు సోమవారం కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్‌ను కలిశారు. సుధ(కైకలూరు), పి.గిరిజ సత్యకుమారి(భీమడోలు), పి.వెంకటరమణ (నూజివీడు), డీఎస్ఎస్ వి.ప్రసాద్(చింతలపూడి), వై.పట్టాబిచౌదరి (జంగారెడ్డిగూడెం), ఎం.శ్రీనివాసరావు (డీటీఎఫ్ ఏలూరు), కె.వీరబాబు(ఎస్‌హెచ్‌వో పోలవరం), కె.విద్యాసుధాకర్(ఎస్‌హెచ్‌వో ఏలూరు)లను కలెక్టర్‌కు ఎస్ఈబీ జేడీ ఎన్.సూర్యచంద్రరావు పరిచయం చేశారు.

జై శ్రీరామ్


భీమవరంలో బాల హనుమాన్‌లు


పెనుమంట్రలో రాముని వేషధారణలతో గ్రామోత్సవం


ఆరుగొలనులో శోభాయాత్ర



అట్టహాసంగా శోభాయాత్ర

ద్వారకాతిరుమల, జనవరి 22: అయోధ్య రామమందిరంలో బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని సోమవారం శ్రీవారి క్షేత్రంలో భక్తులు అట్టహాసంగా శోభాయాత్ర నిర్వహించారు. రథంపై సీతారామలక్ష్మణుల విగ్రహాలను వుంచి కుంకుళ్లమ్మ ఆలయం నుంచి చిన తిరుమలేశుని ఆలయం వరకు భక్తి శ్రద్ధలతో యాత్ర జరిపారు. మహిళలు, చిన్నారుల కోలాట భజనల నడుమ ఈ యాత్ర క్షేత్ర పురవీధుల్లో వైభవంగా జరిగింది. బాలరామ, లక్ష్మణ వేషాలు ఆకట్టుకున్నాయి. చెరువువీధి రామాలయంలో రాములోరి కల్యాణాన్ని అంగరంగవైభవంగా నిర్వహించారు.


ఆకట్టుకున్న చిన్నారుల రామలక్ష్మణుల వేషధారణ


ఏలూరు రామకోటిలో హనుమాన్ వేషధారుల జైశ్రీరామ్ నినాదాలు


పెనుగొండలో విద్యార్థుల జై శ్రీరామ్ ఆకృతి


జంగారెడ్డిగూడెం నూకాలమ్మ గుడి వద్ద దీపాలతో జై శ్రీరామ్





అగ్గిపుల్లపై బాలరాముడు

ఏలూరు కల్చరల్ : అయోధ్య రామ మందిరంలో బాలరాముడు విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఏలూరుకు చెందిన సూక్ష్మ కళాకారుడు మేతర సురేశ్‌బాబు సెంటి మీటర్ ఎత్తులో అగ్గి పుల్లపై బాలరాముడిని చెక్కి ఔరా అనిపించాడు.

అంగన్‌వాడీల ఆక్రందన


ఏలూరులో నిలిచిన ట్రాఫిక్



ఏలూరులో రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు

అంగన్‌వాడీలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. తమ సమస్యల పరిష్కారం కోసం విజయవాడ వెళుతున్న వారిని నిర్దాక్షిణ్యంగా ఎక్కడికక్కడ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని ఏలూరు తీసుకురావడంతో ఉద్రిక్తత నెలకొంది.


ఏలూరు బస్టాండ్‌లో అంగన్‌వాడీలను అరెస్ట్ చేస్తున్న పోలీసులు



నిర్బంధకాండ









ఏలూరు : విజయవాడతోపాటు ఏలూరు మీదుగా వెళుతున్న అంగన్‌వాడీలను ఎక్కడికక్కడ అరెస్ట్ చేసి బస్సుల్లో తీసుకువస్తున్న దృశ్యాలు

మన్యంలో పులి సంచారం?


ఎర్రాయిగూడెం-మంగదేవిపేట వద్ద గుర్తించిన పాదముద్రలు

బుట్టాయగూడెం, జనవరి 22: పశ్చిమ ఏజెన్సీ మన్యం ప్రాంతంలో కొన్నిరోజులుగా పులి సం చరిస్తున్నట్లు ప్రచారం జరుగుతుండటంతో ప్రజలు భయాందో ళనలు చెందుతున్నారు. ఏసమ యంలో దాడిచేస్తుందోనని బిక్కు బిక్కుమంటూ రోజులు వెళ్లదీస్తున్నారు. మూగజీవాల పరిస్థితిపై ఆందోళన చెందుతున్నారు. మం డలంలోని ఎర్రాయిగూడెం, కొయ్యలగూడెం మండలం మంగ దేవిపేట సమీపంలో చెరువు వద్ద పులి పాదముద్రలను సోమవారం గుర్తించిన గ్రామస్థులు, ఇదే విషయాన్ని కన్నాపురం అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. పాద ముద్రలు ఉన్న ప్రాంతాన్ని సందర్శించి పరిశీలిం చారు. అవి పులి పాదముద్రలు కావని అధికారులు తేల్చిచెప్పారు. పులి పాదముద్రలు ఇంకా పెద్దవిగా ఉంటాయని, ఆకలితో ఉన్న పులి గ్రామాల్లోకి వస్తే పశువులపై దాడిచేయకుండా ఉండదని తెలిపారు. పాదముద్రలు ఉన్న ప్రదేశం పక్కనే పశువులు ఉన్నాయని వాటిపై ఎటువంటి దాడి జరగలేదని ఎఫ్ఎస్‌వో మూర్తి చెప్పారు. మన్యంలో పులి సంచారం లేదన్నారు. ప్రజలు ఎటువంటి భయాందోళనలు చెందవద్దని అన్నారు. అవి అడవిపిల్లి పాదముద్రలుగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు.

బాట చార్జీల అక్రమ వసూళ్లపై చర్యలు తీసుకోండి : ప్రభుత్వానికి లేఖ

పాలకొల్లు, జనవరి 22: అక్రమంగా బాట చార్జీలు వసూలు చేస్తున్న ప్రతిమ గ్రూప్ ఇన్‌చార్జ్ అంజిరెడ్డిపై చర్యలు తీసుకోవాలని సోమవారం ఉభయగోదావరి లారీ అసోసియేషన్, బిల్డర్ కార్మికులు, డ్రైవర్ అసోసియేషన్, భవన నిర్మాణ కార్మికులు, ర్యాంప్ బంటా కార్మికులు సంయుక్తంగా ప్రభుత్వానికి ఓ లేఖ రాశారు. సౌత్ ఇండియా ప్రతిమ గ్రూప్ ఇన్‌చార్జ్ అంజి రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా ఇసుక దందా చేస్తున్నారని , గతంలో జేపీ సంస్థ బాట చార్జీలు లేకుండా నడిపేవారని లేఖలో పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన రేట్లకే టన్ను రూ.475కు అమ్మేవారని చెప్పారు. అయితే ఇప్పుడు అదనంగా చెల్లిస్తేనే లోడు చేయాలని ర్యాంపు సిబ్బందికి ఉత్తర్వులు ఇచ్చారన్నారు. ట్రాక్టర్‌కు రూ.500, ఆరు చక్రాల లారీకి రూ.1,000, పది చక్రాల లారీకి రూ1,500, 12 చక్రాల లారీకి రూ.2,000 చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారన్నారు. ఈ చెల్లింపుల్లో రశీదులు ఉండవని చెప్పారు. దీనిపై తాము గత మూడు రోజులుగా ధర్నా చేస్తున్నామని లేఖలో పేర్కొన్నారు. రేట్లు తగ్గించమని అధికారులకు మొరపెట్టుకున్నా 'మా చేతుల్లో ఏమీ లేదు.. ప్రతిమ గ్రూప్ ఇన్‌చార్జి అంజిరెడ్డి కుదరదు అంటున్నారని చెప్పారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా వసూలు చేస్తున్నారన్నారు. దీనిపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని లేఖలో పేర్కొన్నారు.

26న ఏలూరుకు షర్మిల రాక

ఏలూరు కార్పొరేషన్, జనవరి 22 : ఏపీసీసీ పగ్గాలు చేపట్టిన షర్మిల ఈనెల 26న ఏలూరు నగరానికి విచ్చేయనున్నట్టు ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఐకమత్యంతో ప్రజా సమస్యలపై పోరాడుతూ రాబోయే ఎన్నికల్లో విజయం సాధించేందుకు కృషి చేయాలని రామ్మోహన్‌రావు పిలుపునిచ్చారు. ముందూరుకు చెందిన సీనియర్ నేత ఆలపాటి నరసింహమూర్తి కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్టు ప్రకటించారు. ప్రతాప బాల వెంకట సుబ్రహ్మణ్యం, గౌడు రంగ బాబు, గణపతిరాజు, కె.మూర్తి, సుబ్బారావు పాల్గొన్నారు. కాగా, అసోంలో నిర్వహిస్తున్న న్యాయ జూడో యాత్రపై జరిగిన దాడికి నిరసనగా నగరంలో రాస్తారోకో జరిపారు.

నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు

అధికారులు, సిబ్బందికి నోటీసులు జారీ

ఏలూరు క్రైం, జనవరి 22 : వైద్యశాఖలో నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన అభ్యర్థులపై నమోదైన కేసు దర్యాప్తు వేగవంతం చేశారు. 2023లో వైద్య విధాన పరిషత్‌లో ఔట్‌సోర్సింగ్ విధానంలో వివిధ రకాల పోస్టులకు నోటిఫికేషన్ జారీచేయగా.. ఆడియోమెట్రిక్ టెక్నీషియన్ పోస్టులకు కొందరు దరఖాస్తులు చేశారు. అర్హత ఉన్నవారిని కాదని నకిలీ సర్టిఫికెట్లు సమర్పించిన వారికి ఉద్యోగాలు ఇచ్చారని ఓ వ్యక్తి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో ఓ ఉద్యోగిని అవకతవకలకు పాల్పడినట్లు గుర్తించారు. ఆధారాలతో ఉన్నతాధికారులకు సమర్పిం చడంతో ఏలూరుజిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ షర్మిష్ఠ ఆధ్వర్యంలో ప్రాథమిక విచారణ చేశారు. అక్రమాలు జరిగాయని, నకిలీ సర్టిఫికెట్లతోనే ఉద్యోగాలు పొందారని కలెక్టర్‌కు నివేదిక అందించడంతో కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ ఆదేశాలతో ప్రస్తుత డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్‌సతీష్ కుమార్ ఆ ఇద్దరు నకిలీ ఉద్యోగులపై ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో మిత్రానంద్, వీరల నరేష్‌పై క్రిమినల్ కేసు నమోదు చేశారు. వారిని ఉద్యోగాల నుంచి తొలగించారు. అయితే అందుకు సంబంధించిన రికార్డుల కోసం పోలీసులు డీసీహెచ్ఎస్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నప్పటికీ రికార్డులు ఇవ్వడంతో అక్కడ సిబ్బంది జాప్యం చేస్తున్నట్లు తెలుస్తోంది. చివరకు పోలీసులు రాత పూర్వకంగా నోటీసులు జారీ చేశారు. ఎంత మంది దరఖాస్తులు చేసుకున్నారు, ఎంతమంది మెరిట్ లిస్టులో ఉన్నారు అనే వివరాలను తెలుసుకోవడానికి అధికారులకు నోటీసులను జారీ చేశారు. కేసును టూటౌన్ సీఐ ఎం.ప్రభాకర్ ఆధ్వర్యంలో ఎస్ఐ సాధిక్ దర్యాప్తు చేస్తున్నారు. ఒకటి రెండురోజుల్లో ఇద్దరు నకిలీ ఉద్యోగులతో పాటు మరో ఇద్దరు సిబ్బందిని కూడా అరెస్టు చేస్తారని సమాచారం.

అపరిచిత వాట్సాప్ కాల్స్‌కు స్పందించొద్దు : ఎస్పీ



ఏలూరు క్రైం, జనవరి 22 : అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే వాట్సప్ కాల్స్‌కు స్పందించవద్దని ఎస్పీ డి. మేరీ ప్రశాంతి సూచించారు. పోలీస్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 45 మంది ఫిర్యాదుల దారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎస్పీ మాట్లాడుతూ, అపరిచిత వ్యక్తులు చేసే ఫోన్లకు స్పందించొద్దని, ఓటీపీ చెప్పవద్దని సూచించారు. ఫిర్యాదులను స్వీకరించి తక్షణ చర్యలు చేపట్టడానికి అధికారులతో మాట్లాడారు. అప్పటికప్పుడే ఫోన్‌లో ఆదేశా లు జారీ చేశారు. చట్ట ప్రకారం న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

వైద్యాధికారి పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 22 : ఉమ్మడి జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఐడీఎస్‌పీ విభాగంలో ఎపిడెమియాలజిస్టు పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేసేందుకు అర్హతగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ఠ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25లోగా దరఖాస్తులను డీఎంహెచ్‌వో కార్యాలయంలో అందజేయాలని అన్నారు. పూర్తివివరాలకు వెస్ట్ గోదావరి.ఏపీ.జీవోవి.ఐఎన్ సందర్శించాలని కోరారు.

నదుల్లో నీరున్నా.. సాగునీటికి కటకట!

» అడుగంటిన కాలువలు .. ఆందోళనలో అన్నదాతలు

» పట్టించుకోని అధికారులు.. ట్యాంకర్ల ద్వారా పైరును బతికించుకుంటున్నరైతన్నలు




ఆయిల్ ఇంజన్‌తో తోడుకుంటున్న నీరు, కాళ్ళలో అడుగంటిన పంట కాలువ

కాళ్ళ, జనవరి 22 : అన్నపూర్ణగా పేరుగాంచిన కోస్తాంధ్రలో సాగునీరు పూర్తిస్థాయిలో అందక అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారు. ప్రతి ఏడాదీ ఏదో రూపేణా కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయని వాపోతున్నారు. మౌచింగ్ తుఫాన్ వల్ల సార్వా పంట కోల్పోగా పూర్తిగా నష్టపోయా మని, దాళ్వాలోనైనా కష్టాల నుంచి గట్టెక్కవచ్చని ఆశిస్తే ఆదిలోనే సాగునీటి కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తోందని లబోదిబో మంటున్నారు. కాలువల్లో అరకొరగా ఉన్న నీటిని ఆయిల్ ఇంజన్లతో తోడుకుంటుం డడంతో పెట్టబడి ఖర్చు తడిచి మోపె డవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దాళ్వా ప్రారం భదశలోనే ఈ విధంగా ఉంటే ఆ తరువాత పరిస్థితి ఏమిటని ఆందోళన చెందు తున్నారు. పంటను కాపాడుకునేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. నదుల్లో నీరున్నా సాగునీటి కొరత తప్పడం లేదంటున్నారు.

మండలంలో సుమారు 4,500 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. కాళ్ళ, కాళ్ళకూరు, సీసలి, బొండాడ, ఏలూరుపాడు, కోమటిగుంట తదితర గ్రామాల్లో ఇప్పటికే నాట్లు ప్రారంభమయ్యాయి. నీరు సక్రమంగా అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన పంట కాలువైన కెలంక ఛానల్ పూర్తిగా అడుగంటి పోవడంతో ఆయకట్టు రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కాలువకు పూర్తిస్థాయిలో సాగునీరు అందక రైతులు సొంత సొమ్ముతో ఆయిల్ ఇంజన్‌లు ఏర్పాటు చేసుకుని సాగు నీటిని తోడుకుంటు న్నారు. ఇప్పటికే అధిక వర్షాలు కారణంగా ఖరీఫ్ పంట పూర్తిగా నష్టం చేకూర్చిన తరుణంలో రబీ లో సాగునీటి కోసం అదనపు ఖర్చు మరింత భారమైందని రైతన్నలు వాపోతున్నారు. వాటర్ ట్యాంకర్ల ద్వారా నీరుతెచ్చి పంటను రక్షించు కుంటున్నట్టు చెప్పారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని అన్నారు. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి దాళ్వా పంటకు పూర్తిస్థాయిలో సాగునీరందిస్తే కొంతమేర కోలు కుంటామని పలువురు రైతులు తెలిపారు.

కాలువకు నీరొచ్చి 15 రోజులైంది..



కె.లంక పంటకాలువను ఆనుకుని ఆరు ఎకరాలు వరి సాగు చేస్తున్నా. కాలువకు నీరు వచ్చి 15 రోజులు పైనే అవుతుంది. సార్వా తుఫాన్‌కు నీటిపాలైంది. ఇప్పుడు దాళ్వా పంట నీరు లేక ఎండిపోతోంది. ఇరిగేషన్ అధికారులు అడిగితే సమాధానం లేదు.

-బండారు శ్రీనివాసరావు, రైతు- కాళ్ళ

క్రైం కార్నర్

జాతరలో ఘర్షణ.. ఇద్దరికి తీవ్రగాయాలు

మొగల్తూరు, జనవరి 22: సత్తెమ్మ జాతరలో సోమవారం ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలివి. ప్రతి మూడు సంవత్సరాలకు ఓసారి సత్తెమ్మ జాతర నిర్వహిస్తారు. ఈ ఏడాది ఆప్రాంత వాసులు రెండు వర్గాలుగా విడిపోయి వేర్వేరుగా జాతర నిర్వహించారు. ఆలయ వర్గీయుల జాతర ముగింపును పురస్కరించుకుని అమ్మవారిని ఊరేగించి సంప్రదాయం ప్రకారం గద్దె దించే ప్రాంతంలో మరో వర్గం అక్కడ అమ్మవారిని నిలబెట్టి జాతర నిర్వహించింది. గద్దె దించే ప్రాంతంలో ఇరు వర్గాల మధ్య వాదోపవాదాలు జరిగాయి. పోలీసులకు ఒక వర్గం ఫిర్యాదు చేయడంతో ఇరువర్గాలపెద్దలతో చర్చించారు. అమ్మవారిని రాగి చెట్టుకింద దింపాలని ఒప్పందం కుదిరినట్టు తెలిసింది. ఈలోపు ఒక వర్గం మరో వర్గంవారి కళ్లలో కారం చిమ్మి కొట్లాటకు దిగడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నరసాపురం ఎస్ఐ గురవయ్య, మొగల్తూరు ఇన్‌చార్జ్ ఎస్ఐ అబ్దుల్ రజాక్ ఇరువర్గాలను చెదరగొట్టి పోలీస్ సిబ్బందితో పహారా ఏర్పాటు చేశారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

జంగారెడ్డిగూడెం, జనవరి 22 : తనను దుర్భాషలాడి, కులం పేరుతో దూషించిన వ్యక్తిపై ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు ట్రైనీ డీఎస్పీ బి.విద్య తెలిపారు. వివరాలివి. జంగారెడ్డిగూడెంకు చెందిన ఓ మహిళ తన భర్తతో గొడవపడి విడిపోయి కుమార్తెతో కలసి ఉంటోంది. పక్క ఇంట్లో ఉంటున్న రియాజ్‌తో సహజీవనం చేస్తోంది. అయితే రియాజ్ గత కొంత కాలంగా మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడని, ఈనెల 11న తనను కొట్టి, కులం పేరుతో దూషించినట్టు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

ఊరెళ్లి వచ్చేలోగా ఇంట్లో చోరీ.. పోలీసులకు ఫిర్యాదు

పెదవేగి, జనవరి 22 : చోరీపై బాధితులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలివి. మండలంలోని బాపిరాజుగూడెంకు చెందిన కొసరాజు ధర్మరాజు కుటుంబసభ్యులతో కలిసి ఈనెల 17న హైదరాబాద్ వెళ్లారు. తిరిగి సోమవారం ఉదయం ఇంటికి వచ్చారు. ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోనకెళ్లి చూడగా బీరువాలో ఉన్న నగదు, బంగారు, వెండి ఆభరణాలు అపహరించుకుపోయారని గుర్తించారు. బాధితుడు ధర్మరాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూ.60వేలు నగదుతోపాటు 20 గ్రాముల బంగారు ఆభరణాలు, 250 గ్రాముల వెండి వస్తువులు చోరీకి గురయ్యాయని ఫిర్యాదులో పేర్కొన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

ఏలూరు క్రైం, జనవరి 22 : అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలివి. ఏలూరు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వట్లూరు పంచాయతీ నెహ్రూకాలనీకి చెందిన మోగాడ రవిశంకర్ సత్రంపాడు నాయుడు హోటల్ వద్ద మద్యం విక్రయిస్తున్నాడు. పోలీసులకు సమాచారం అందడంతో సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేశారు. ఐదు మద్యం బాటిల్స్, రూ.150 స్వాధీనం చేసుకుని అతడిని అరెస్టు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు.

ముగ్గురు కోడిపందేలరాయుళ్లు..

జంగారెడ్డిగూడెం, జనవరి 22 : కోడిపందేల శిబిరంపై సోమవారం పోలీసులు దాడి చేసి ముగ్గుర్ని అరెస్ట్ చేశారు. వివరాలివి. మండలంలోని ఎ.పోలవరం గ్రామ శివారులో కోడిపందేలు ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తన సిబ్బందితో దాడి చేశారు. ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.3,120 నగదు, ఒక కోడిపుంజు, కోడికత్తెను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు.

విద్యుత్ స్తంభం పైకెక్కి మతిస్థిమితం లేని వ్యక్తి హల్‌చల్

» కిందికి దించిన అగ్నిమాపక సిబ్బంది

» స్టేషన్‌కు తరలించిన పోలీసులు



ఆకివీడు రూరల్ జనవరి 22 : మండలంలోని కళింగగూడెంకు చెందిన పమిడి శ్రీనివాసరావు (48) సోమవారం విద్యుత్ స్తంభంపైకి ఎక్కి హల్‌చల్ చేశాడు. సుమారు రెండున్నర గంటలపాటు స్తంభంపై ఉండటంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. విద్యుత్ స్తంభం ఎక్కడం చూసిన స్థానికులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. అగ్నిమాపక, పోలీస్ సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని కిందికి దించారు. పోలీసులు అతడిని, అతడి తండ్రిని స్టేషన్‌కు తరలించారు. అతడికి మూగతోపాటు మతిస్థిమితం కూడా లేదని స్థానికులు చర్చించుకుంటున్నారు. స్తంభం ఎక్కడానికి ముందు తన నివాసానికి సమీపంలో ఓ మహిళ తలపై కొట్టినట్టు, టీవీ, ఇతర పరికరాలు ధ్వంసం చేసినట్లు స్థానికులు తెలిపారు. గతంలో అనేక పర్యాయాలు విద్యుత్ స్తంభం ఎక్కినట్టు చెప్పారు.అతడికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు.

ఐదు రోజులుగా సెల్‌టవర్‌పైనే..

భీమవరం క్రైం, జనవరి 22 : తనకు రావాల్సిన జనరల్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ పత్రాలు ఇవ్వడం లేదంటూ ఐదు రోజులుగా లోకం ఏసు అనే వ్యక్తి సెల్‌టవర్‌పైనే ఉన్నాడు. గురువారం ఉదయం ఎక్కిన వ్యక్తి సోమవారం రాత్రి వరకు దిగలేదు. పోలీసు, రెవెన్యూ, ఫైర్ అధికారులు అక్కడే వేచి చూస్తున్నారు. న్యాయం చేస్తామని హామీ ఇచ్చినా అతడు కిందకు దిగడం లేదు.

దళిత ద్రోహి జగన్ : టీడీపీ నేతల ఆగ్రహం



నిరసన తెలుపుతున్న టీడీపీ నేతలు

ఏలూరు టూటౌన్, జనవరి 22: దళితులపై దమనకాండ కొనసాగిస్తూ ముఖ్యమంత్రి జగన్ దళిత ద్రోహిగా మిగిలిపోయారని టీడీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జాలా బాలాజీ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దాసరి అంజనేయులు, ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. జగన్ ఐదేళ్ల పాలనలో దళితులపై దాడులు, హత్యలు, అత్యాచారాలు, శిరోముండనం యథేచ్ఛగా జరుగుతున్నాయన్నారు. కరోనా సమయంలో మాస్కులు అడిగిన డాక్టర్ సుధాకర్ మృతికి ప్రభుత్వం కారణమన్నారు. వైసీపీ ఎమ్మెల్సీ దళితుడిని దారుణంగా హత్య చేశాడన్నారు. కార్యక్రమంలో రత్తయ్య, విక్కీ, వెంకటరమణ, బుజ్జి పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే టీడీపీ లక్ష్యం



పథకాలను వివరిస్తున్న బొమ్మాజి అనిల్, నేతలు

జంగారెడ్డిగూడెం, జనవరి 22: రాష్ట్ర ప్రజల సంక్షేమమే టీడీపీ లక్ష్యమని నియోజకవర్గ యువ నాయకుడు బొమ్మాజి అనిల్ అన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో సోమవారం బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. చంద్రబాబునాయుడితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమన్నారు. చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, షేక్ ముస్తఫా, కౌన్సిలర్ నంబూరి రామచంద్ర రాజు, బొబ్బర రాజ్‌పాల్ కుమార్, తుటికుంట దుర్గారావు, తూటికుంట రాము, రాజేంద్ర, నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు

పట్టణంలోని ఇందిరా నగర్ నాలుగో వార్డులో బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు రావూరి కృష్ణ, జనసేన కౌన్సిలర్ వలవల తాతాజీ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ, జనసేన రూపొందించిన 11 గ్యారెంటీలను జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్, నారా చంద్రబాబు నాయుడు నూరు శాతం అమలు చేస్తారన్నారు. చిట్రోజు తాతాజీ, అల్లూరి రామకృష్ణ, షేక్ యాకోబ్, అన్నపరెడ్డి గంగాధర్, సేలం గోపి, మద్దిపాటి వినయ్, మోటేపల్లి సురేష్, షేక్ అన్వర్, పీసుపాటి అభిరామ్, కాసాని ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీకి బీసీలే వెన్నెముక



మాట్లాడుతున్న బొరగం శ్రీనివాసులు

టి.నరసాపురం, జనవరి 22: తెలుగుదేశం పార్టీకి బీసీలే వెన్నెముక అని నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు అన్నారు. జయహో బీసీ కార్యక్రమాన్ని మండల అధ్యక్షుడు నాయుడు రామకృష్ణరావు గౌడ్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. శ్రీనివాసులు మాట్లాడుతూ బీసీలను జగన్ రెడ్డి మోసగించారని విమర్శించారు. తెలుగుదేశం పార్టీలోనే అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందాలంటే రాష్ట్రానికి చంద్రబాబే ముఖ్యమంత్రి కావాలన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు జయ్యవరపు శ్రీరామ్మూర్తి, శీలం వెంకటేశ్వరరావు, దాసరి శ్యామ్ చంద్ర శేషు, ఆచంట సూర్యనారాయణ, బొంతు సత్యనారాయణ, జోనుబోయిన సోంబాబు, కొండపల్లి రవి, ఆచంట అనిల్ కుమార్, తోట లక్ష్మీనారాయణ, వాసిరెడ్డి రామ్మోహన్, పెద్దిన సత్యనారాయణ, చంద్రశేఖర్, భీమవరపు జగన్మోహన్రావు, ఘంట సతీష్, కొరివి వెంకటేశ్వరరావు, కొల్లి రమేష్, బండి శ్రీను, చిలకా బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో అంధకారంలో యువత



కరపత్రాన్ని అందిస్తున్న చింతమనేని

పెదవేగి, జనవరి 22: జగన్ పాలనలో రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు కరువై, యువత భవిష్యత్ అంధకారమైందని మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. అమ్మపాలెంలో సోమవారం బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పాటుచేసిన తరువాత ఇచ్చిన హామీలను అమలు చేసే బాధ్యత టీడీపీదేనని, దానికి ఇదే హామీ అని భవిష్యత్ గ్యారెంటీ పత్రాలను ప్రజలకు అందించారు. జగన్ పాలనలో యువతకు ఉపాధి అవకాశాలులేక ఇతర రాష్ట్రాలకు వలసపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమికి విజయాన్ని అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ముందుగా గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి, నివాళులర్పించారు. సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనల్లో ప్రభాకర్ పాల్గొన్నారు. పార్టీనాయకులు బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, లావేటి శ్రీనివాసరావు, మాగంటి నారాయణ ప్రసాద్, మోతుకూరి నాని, అడపా శ్రీను, గుర్రం మాధవ, పెనుబోయిన మహేష్ యాదవ్, కొరపాటి రఘు, మంచినేని శ్రీనివాసరావు, అయినాల వెంకటనారాయణ, చందు శ్రీనివాస్, మురళి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

పెదవేగి మండలం అమ్మపాలెం గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. చింతమనేని ప్రభాకర్ సమక్షంలో టీడీపీలో చేరారు. మెడంకి ప్రవీణ్, రేమల్లి రత్నప్రసాద్, అఖిల్, మారుమూడి మణిబాబు, మెడంకి అశోక్, పిల్లా భాస్కర్, రేమల్లి కిరణ్, అన్నవరపు సుధాకర్, వీర్ల రోసియ్య, పెరికే బుల్లిరామయ్య జంగం వినయ్, కట్టూరి ఇలీప్, పిట్టా రాజేష్, శ్యామ్, జంగం అశోక్ కుమార్ సహా పలువురికి చింతమనేని టీడీపీ కండువా కప్పి ఆహ్వానించారు.

తాడిచర్లలో టీడీపీ నేతల ఇంటింటి ప్రచారం



తాడిచర్లలో సర్పంచ్ పసుమర్తి ప్రచారం

కామవరపుకోట, జనవరి 22 : తాడిచర్లలో సర్పంచ్ పసుమర్తి పార్థసారధిబాబు ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ సంతకాలు చేసిన షూరిటీ పత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. సూపర్-6 ప్రయోజనాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమిని గెలిపించాలన్నారు. వేముల హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.



గుర్వాయిగూడెం మద్ది క్షేత్రం నుంచి శోభాయాత్ర



ఉంగుటూరు శోభాయాత్రలో పాల్గొన్న ధర్మరాజు



కొయ్యలగూడెంలో శోభాయాత్ర



పోలవరంలో మోటార్ బైక్ ర్యాలీ

జై శ్రీరామ్

గ్రామాల్లో మార్మోగిన రామ నామం



ఉంగుటూరు మండలం కైకరం ఆలయంలో రామ నామ జపం



పెదపాడు మండలం రామచంద్రపురం ఆలయంలో దీపారాధన

జంగారెడ్డిగూడెం, జనవరి 22: అయోధ్యలో బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా జిల్లాలోని రామాలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు, శోభాయాత్ర నిర్వహించారు. గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో వివిధ ప్రాంతాల నుంచి పాదయాత్రగా వచ్చిన భక్తులతో శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. అనంతరం మహా మండపంపై ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసి భక్తులకు అయోధ్య రామాలయం గురించి వివరించారు. నూకాలమ్మ ఆలయంలో దీపోత్సవం నిర్వహించారు. పట్టణంలోని సీతారామస్వామి ఆలయంలో ఉత్సవమూర్తులకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొప్పాక శ్రీనివాసరావు నిర్వహణలో శ్రీరామ అష్టోత్తర పూజ చేయించారు. జంగారెడ్డిగూడెం విజయదుర్గ ఆలయంలో సీతారాముల విగ్రహాలకు పంచామృతాభిషేకాలు, అనంతరం వసంతోత్సవం నిర్వహించారు. ఆటో కన్సల్టెన్సీ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి మద్ది ఆంజనేయస్వామి ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. పట్టణంలోని సౌభాగ్య థియేటర్‌లో హనుమాన్ సినిమా ప్రదర్శింపబడుతున్న నేపథ్యంలో శ్రీరామునికి నిర్మాత కరాటం రాంబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి ప్రేక్షకులకు స్వామి వారి ప్రసాదాలను అందజేశారు.

● ఏలూరు కార్పొరేషన్: అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రతిష్ఠ నేపథ్యంలో నగరంలోని పలు డివిజన్లలో రామాలయాలు, పురవీధులు, ఆంజనేయస్వామి మందిరాలు, శ్రీవారి మందిరాలు శ్రీరామ జపంతో మార్మోగాయి. భక్తులకు పానకం, వడపప్పు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. దేవాలయాల వద్ద, కూడళ్లలో శ్రీరాముని భజనలు, హనుమాన్‌చాలీసా పారాయణ నిర్వహించారు. ఆర్ఆర్ పేట వేంకటేశ్వరస్వామి ఆలయం, అగ్రహారం జనార్ధనస్వామి కోవెల ప్రాంగణంలో పూజలు నిర్వహించారు. రామకోటి ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామ మందిరం దర్మకర్త గాదంశెట్టి రమేష్‌కుమార్, మిత్రబృందం భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు. ప్రసాదం పంపిణీ జరిపారు. దక్షిణపువీధిలోని అశోకచక్రం సెంటర్‌లో కార్పొరేటర్, భక్తబృందం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆళ్ల నాని, కారుమూరి సునీల్‌కుమార్ పాల్గొన్నారు. బావిశెట్టివారిపేటలో సమరసత సేవా ఫౌండేషన్ దీపారాధన, భజన నిర్వహించారు. రామానగర్ కాలనీ అభయాంజనేయస్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, భజనలు చేశారు. కొత్తపేట కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో కోదండ రామాలయానికి మహిళలు సారె, కలశాలతో ఊరేగింపు నిర్వహించి పూజలు నిర్వహించారు. జూట్‌మిల్లు సెంటర్ ధర్మపురి ప్రాంగణంలో విశేష పూజలు, పవరుపేటలో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేశారు.

● ఏలూరు టూటౌన్: అంబికా గ్రూప్ సంస్థల ఆధ్వర్యంలో ఆనంద వేడుకలు నిర్వహించినట్లు చైర్మన్ అంబికా కృష్ణ తెలిపారు.

● బుట్టాయగూడెం: రెడ్డిగణపవరంలో శ్రీరాముని చిత్రపటంతో శోభయాత్ర నిర్వహించారు. వీధులన్నీ రామనామంతో మారుమోగాయి. అనంతరం రామాలయం వద్ద భక్తులకు ప్రసాదం, పానకం పంపిణీ చేశారు. దుద్దుకూరు రామాలయంలో ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులు ప్రత్యేక పూజలను నిర్వహించారు.

● పోలవరం: మండలంలో బీజేపీ ఆధ్వర్యంలో పలుచోట్ల బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ, సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు, సభ్యులు, మండల రామాలయాల కమిటీ సభ్యులు, రామభక్తులు ద్విచక్ర వాహనాలపై భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టిసీమ సెంటర్‌లో వినాయకుడి ఆలయం వద్ద, కొత్తనూతనగూడెం రామాలయం వద్ద బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ, సీతారాముల కల్యాణం నిర్వహించారు. అనంతరం భారీ అన్నదానం నిర్వహించారు.

● లింగపాలెం: మండలంలో పలు దేవాలయాల్లో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కోదండరాముని విగ్రహాలను కోలాటాలు, భజనల మధ్య ఊరేగించారు. ఆలయాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

● కుక్కునూరు: మండలంలో రామ భక్తులు పలు కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఆలయాల్లో పూజలు నిర్వహించి పాదయాత్ర, ద్విచక్రవాహనాలపై ప్రదర్శన చేశారు. కుక్కునూరు, కివ్వాక, కొండపల్లి, మారేడుబాక, రాజీవనగర్, గొమ్ముగూడెం గ్రామాల్లో అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం భక్తులంతా కలిసి ఆలయాల వద్ద దీపారాధన చేశారు.

● కామవరపుకోట: రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు, హనుమాన్‌చాలీసా పారాయణ నిర్వహించారు. ఆడమిల్లి, తడికలపూడి, కె.ఎస్.రామవరం, రామన్నపాలెం, తూర్పుయడవల్లి, రావికంపాడు, జీలకర్రగూడెం తదితర గ్రామాల్లో పూజలు నిర్వహించారు.

● ఉంగుటూరు: మండలంలో శోభాయాత్రలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉంగుటూరు, నారాయణపురం, కైకరం గ్రామాలలో శోభాయాత్రలు నిర్వహించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పత్సమట్ల ధర్మరాజు నేతృత్వంలో శోభాయాత్ర జరిగింది. నారాయణపురం కోదండ రామాలయంద వద్ద,కైకరం రంగమ్మ ఆలయం వద్ద పారాయణ నిర్వహించారు.

● చింతలపూడి: మండలంలోని అన్ని రామాలయాల్లో పూజలు, అభిషేకాలు, పాదయాత్రలు నిర్వహించారు. చింతలపూడి అభయాంజనేయస్వామి ఆలయం నుంచి మహిళలు జైశ్రీరామ్ నినాదాలతో పాదయాత్ర నిర్వహించారు. మోటారు సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. యర్రగుంటపల్లి, సీతానగరం, రామునిగట్టు, ఊటసముద్రం, రాఘవాపురం, ప్రగడవరం, యండపల్లి గ్రామాల్లో రామాలయాలు ముస్తాబు చేసి పూజలు, భజనలు నిర్వహించారు.

● పెదపాడు: మండలంలోని గ్రామాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. జై శ్రీరాం నినాదాలతో మార్మోగాయి. రామాలయాలను అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించి దీపారాధన చేశారు.

● టి.నరసాపురం: మండలంలో వాడవాడలా రామాలయాల వద్ద పూజలు నిర్వహించారు. టి.నరసాపురం రామాలయం, పెద్ద రామాలయం, మల్లుకుంట, బొర్రంపాలెం రామాలయాల వద్ద అన్న సమారాధనలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

● భీమడోలు: మండలంలో శ్రీరామ నామ జపంతో ఆలయాలు మార్మోగాయి. భీమడోలు, గుండుగొలను, పూళ్ళ, పోలసానపల్లి, కొల్లేరు గ్రామాల్లోని సీతారామ ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించారు. గాయత్రి బ్రాహ్మణ సేవా సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి కాశీ బొట్ల నాగవెంకట పార్వతీశ్వరశర్మ ఆధ్వర్యంలో పోలసానపల్లి అగ్రహారం నుంచి భీమడోలు జంక్షన్ వరకూ బ్రాహ్మణ సంఘ సభ్యులు శోభాయాత్ర నిర్వహించారు.

● కొయ్యలగూడెం: మండలంలో శోభాయయాత్ర నిర్వహించి రామాలయాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. దిప్పకాయలపాడు, బయ్యన్నగూడెం, కొయ్యలగూడెం, కన్నాపురం, పొంగుటూరు, రాజవరం, యర్రంపేట తదితర గ్రామల్లోనూ శోభాయయాత్రలు ఘనంగా జరిగాయి.

● జీలుగుమిల్లి: రామాలయంలో ప్రత్యేక పూజలు, భజనలు, రామ నామంతో ర్యాలీ నిర్వహించారు. దర్బగూడెం, పి.అంకంపాలెం, వంకవారిగూడెం రామాలయాల్లో శ్రీరామనామ కీర్తనలతో ప్రత్యేక పూజలు చేశారు.



పూజలు చేస్తున్న అంబికా కృష్ణ, గారపాటి తదితరులు



భీమడోలు జంక్షన్‌లో బ్రాహ్మణ సంఘం శోభాయాత్ర



జంగారెడ్డిగూడెంలో ప్రసాదాలు ఇస్తున్న కరాటం



ప్రగడవరంలో భక్తుల ఊరేగింపు

రహదారి భద్రత పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శాంతికుమారి

ఏలూరు రూరల్, జనవరి 22: వాహనదారులు రహదారి భద్రత నియమాలు పాటించాలని జిల్లా రవాణాశాఖ అధికారి ఎస్.శాంతి కుమారి అన్నారు. ఆర్టీసీ గ్యారేజ్‌లో సోమవారం రహదారి భద్రత వారోత్సవాలు నిర్వహించారు. రహదారి ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. ప్రతి ఒక్కరు సీట్ బెల్టు, హెల్మెట్ విధిగా ధరించాలన్నారు. ఆర్టీసీ డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, బస్సులు ప్రమాదాలకు గురికాకుండా చూడాలన్నారు. త్రీటౌన్ సీఐ వి.వెంకటేశ్వరరావు, ఎంవీఐ జి.ప్రసాదరావు, ఆర్టీసీ డీఎం వాణి, ఎస్సై రాంబాబు, ఏఎంవీఐ స్వామి, ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్ర

ఏలూరు కలెక్టరేట్, జనవరి 22: జిల్లాలో ఈనెల 24 నుంచి 29 వరకు నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు నిర్వహిస్తామని జేసీ బి.లావణ్యవేణి తెలిపారు. సోమవారం ఆమె అధికారులతో మాట్లాడుతూ ఇప్పటివరకు గ్రామ, వార్డు సచివాలయ స్థాయి పోటీలు నిర్వహించామని, నియోజకవర్గస్థాయి పోటీలకు ప్రత్యేకాధికారులను నియమించినట్లు తెలిపారు. పోటీల వివరాలను నియోజకవర్గస్థాయిలో కోచ్‌లను సంప్రదించి తీసుకోవాలన్నారు. ఐటీడీఏ పీవో సూర్యతేజ, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ శ్రీపూజ, డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, ఆర్డీవో ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

చేబ్రోలులో కంకర అక్రమ తవ్వకాలు

ఉంగుటూరు, జనవరి 22: చేబ్రోలులో పోరంబోకు భూమిలో (ఎర్రగుంట చెర్వు) కంకర అక్రమ తవ్వకాలు సాగిస్తున్నారు. నాలుగు రోజుల నుంచి తవ్వకాలు జరుపుతున్నా రెవెన్యూ సిబ్బంది పట్టించుకోవడం లేదని వార్డు సభ్యుడు సోలాపురి మూర్తి ఆరోపించారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. కాగా తవ్వకాలు జరుగుతున్న ప్రాంతంలో వీఆర్ఏను కాపలా ఉంచామని వీఆర్వో ఈశ్వరి తెలిపారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందిస్తున్న ఆశా వర్కర్లు

టి.నరసాపురం, జనవరి 22: ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పీహెచ్‌సీలో పీహెచ్ఎన్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. యూనియన్ జిల్లా నాయకురాలు కె.పోశమ్మ మండల నాయకులు అనుమోలు మురళి మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలో ప్రజలకు ఆరోగ్య సేవలు అందించే ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఆశ డే పేరుతో సంబంధం లేని పనులు చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశ్నించిన వారిని రికార్డుల పేరుతో, ఆన్‌లైన్ పనుల పేరుతో ఇబ్బంది పెడుతున్నారని, ఇన్సెంటివ్ రిపోర్ట్‌పై సంతకం చేయకుండా బెదిరిస్తున్నారని వాపోయారు. హై రిస్క్, ట్యూబెక్టమి కేసులకు వైద్యులు రావడం లేదన్నారు. విజయలక్ష్మి, వనిత, లక్ష్మి, జ్యోతి, దేవమాత తదితరులు పాల్గొన్నారు.

దంతాల సంరక్షణతో సంపూర్ణ ఆరోగ్యం



సిబ్బందితో కరస్పాండెంట్ ఫాదర్ మోజెస్

పెదవేగి, జనవరి 22: దంతాల ఆరోగ్యాన్ని కాపాడుకుంటే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని సెయింట్ జోసెఫ్ దంత వైద్య కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ జి.మోజెస్ అన్నారు. దుగ్గిరాలలోని కళాశాలలో సోమవారం ప్రపంచ కృత్రిమ దంతాల దినోత్సవాన్ని నిర్వహించారు. డాక్టర్ కె.సీతారామ్ ప్రసాద్ మాట్లాడుతూ కృత్రిమ దంతాల అమరిక, పూర్తి పళ్ళసెట్, కృత్రిమ పాక్షిక క్యాప్, పింగాణి క్యాప్, జర్కోనియా క్యాప్, ఇంప్లాంటేషన్ క్యాప్, చిరునవ్వు పునరావాసం, పూర్తి చిరునవ్వు పునరావాసం చికిత్సలు ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు. దంతవైద్య విద్యార్థులకు ముగ్గుల పోటీలు, క్విజ్‌పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ప్రిన్సిపాల్ ఎస్.స్టీవరాజు, దంతవైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

ఉమర్ అలీ సేవలు ప్రశంసనీయం

జంగారెడ్డిగూడెం, జనవరి 22 : పట్టణానికి చెందిన ఉమర్ అలీకి గౌతమ బుద్ధ ధర్మ ప్రచార పరిషత్ వారు సామాజిక సేవ కృషి రత్న అవార్డును సోమవారం ఏలూరులో అందజేశారు. ఉమర్ అలీ వృద్ధులకు, అనాథలకు దాతల సహకారంతో పింఛన్లు, వైద్య శిబిరాలు, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆయన సేవలను గుర్తించి సామాజిక సేవ కృషి రత్న అవార్డును అందజేశారు. ఉమర్ అలీ మాట్లాడుతూ అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందని, అవార్డు అందించడంపై కృతజ్ఞతలు తెలిపారు.

భీమడోలు సర్పంచ్ సునీతకు సత్కారం

భీమడోలు, జనవరి 22: ఆరోగ్య గ్రామం అంశంపై భీమడోలు గ్రామ పంచాయతీ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన సందర్భంగా సోమవారం గ్రామ సర్పంచ్ పాము సునీతా మాన్‌సింగ్‌ను గ్రామస్తులు సత్కరించారు. గ్రామాన్ని జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చేందుకు కృషి చేసిన ఆమె సేవలను కొనియాడారు. జడ్పీటీసీ భవానీరంగా, పుప్పాల కార్తీక్, రావిపాటి శ్రీనివాస్, పసుపులేటి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రేపు బంద్‌కు కార్మిక సంఘాల పిలుపు

కామవరపుకోట, జనవరి 22: అంగన్‌వాడీలను విధుల నుంచి తొలగించాలని ప్రభుత్వం కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో కార్మిక సంఘాలు బుధవారం బంద్ నిర్వహించాలని పిలుపునిచ్చాయి. సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ, టీఎన్‌టీయూసీ, ఐఎన్‌టీయూసీ ఈనెల 24న రాష్ట్ర బంద్‌కు పిలుపు ఇచ్చినట్టు మండల సీపీఐ కార్యదర్శి టీవీఎస్.రాజు తెలిపారు. రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు ఎడ్యుకేషన్ :** దొండపాడులోని బాల అయ్యప్ప క్షేత్రంలో విద్యార్థులకు నిర్వహించిన చిత్రలేఖనం, ముగ్గులపోటీల్లో శనివారపుపేట జడ్పీ హైస్కూలు విద్యార్థిని కె.గాయత్రి ద్వితీయ బహుమతిని అందుకుందని హెచ్‌ఎం ప్రకాశరావు తెలిపారు.
- **ఏలూరు టూటౌన్ :** టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదిన వేడుకలు ఫైర్‌స్టేషన్ సెంటర్ ఎన్టీఆర్ విగ్రహం వద్ద మంగళవారం నిర్వహిస్తున్నట్లు పి.మహేష్‌యాదవ్ తెలిపారు.
- **ఏలూరు రూరల్ :** చాటపర్రు - ఫిల్‌హౌస్‌పేట మీదుగా కైకలూరు రహదారి, 8వ డివిజన్‌లో బీటీ రోడ్డు, 44వ డివిజన్‌లో రహదారి పనులను ఎమ్మెల్యే ఆళ్లనాని ప్రారంభించారు.
- **పెదపాడు :** కొత్తూరులో ప్రజా ఆశీర్వాద యాత్రను ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి సోమవారం ప్రారంభించారు. కారుమూరి సునీల్, జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, ఎంపీపీ బత్తుల రత్నకుమారి పాల్గొన్నారు.
- **జంగారెడ్డిగూడెం :** సినీ హీరో మహేష్‌బాబు సతీమణి నమ్రత పుట్టినరోజు సందర్భంగా మురళి, కృష్ణ మహేష్ యువసేన అధ్యక్షుడు బవిరిశెట్టి మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఏరియా ఆసుపత్రిలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.
- **టి.నరసాపురం :** 33 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో రోడ్డు క్రాసింగ్ పనులు జరుగుతున్నందున విద్యుత్ అంతరాయం కలుగుతుందని జంగారెడ్డిగూడెం ఈఈ పి.రాధాకృష్ణ తెలిపారు. టి.నరసాపురం, గురవాయిగూడెం గ్రామాల్లో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.
- **బుట్టాయగూడెం :** వంకావారిగూడెంలో బాలుర వసతిగృహం పేరును గిరిజన బాలుర వసతిగృహంగా మార్చాలని ఏపీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు తెల్లం రామకృష్ణ అధికారులను డిమాండ్ చేశారు. ఐటీడీఏ నిధులతో నిర్మించిన హాస్టల్‌కు గోకరాజు రంగరాజు విద్యార్థి వసతిగృహంగా పేరు పెట్టడంపై చర్యలు తీసుకోవాలన్నారు.
- **ద్వారకా తిరుమల :** పదో తరగతి విద్యార్థులకు పంగిడిగూడెం సర్పంచ్ పత్తిపాటి యోహాన్ స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. హెచ్‌ఎం పి.సురేష్, జి.కృష్ణవేణి, గుమ్మడి శ్రీను, కె.రుక్మిణీనాథ్ పాల్గొన్నారు.
- **లింగపాలెం :** బోగోలులో ఈ నెల 24న జయహో బీసీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు గరిమెళ్ళ చలపతిరావు తెలిపారు. మండలంలోని బీసీలతో పాటు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.
- **ఉంగుటూరు :** పదో తరగతి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవడంపై బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వ విద్యాలయం జిల్లా సమన్వయ కర్త బి.కే.లావణ్య అవగాహన కల్పించారు. జ్ఞాపక శక్తిని పెంపొందించుకునే మెళకువలు తెలియజేశారు. ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించారు. హెచ్‌ఎం గుళ్ళ ప్రసాదరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్వాడీలను అడ్డుకున్న పోలీసులు

ద్వారకా తిరుమల: ద్వారకాతిరుమల నుంచి విజయవాడకు వెళ్తున్న అంగన్వాడీలను పంగిడిగూడెం వద్ద పోలీసులు అడ్డుకుని బస్సు నుంచి కిందికి దింపివేశారు. నాలుగు గంటలపాటు అక్కడే ఉంచారు. ఆపై వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించి 20 మందిపై కేసు నమోదు చేసి తహసీల్దారు వద్ద బైండోవర్ చేశారు.

● జంగారెడ్డిగూడెం: ఆర్టీసీ డిపో వద్ద సుమారు 15 మందిని, లక్కవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆరుగురు అంగన్‌వాడీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చలో విజయవాడకు వెళ్లేందుకు అనుమతులు లేవంటూ వారిని అడ్డుకున్నారు.

● ఉంగుటూరు: జాతీయ రహదారి వెంబడి కైకరం వద్ద సోమవారం తెల్లవారుజాము నుంచి నిడమర్రు సీఐ మోగంటి వెంకట సుభాష్, నిడమర్రు, చేబ్రోలు ఎస్ఐలు రామారావు, కిరణ్‌కుమార్ సిబ్బందితో ప్రతి బస్సును తనిఖీచేసి అంగన్వాడీలను స్టేషన్‌కు తరలించారు. ఆ సమయంలో ఒక అంగన్వాడీ కార్యకర్తపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో తీవ్ర వాగ్వాదం జరిగినట్టు తెలిసింది.

● చింతలపూడి: ఫాతిమాపురం వద్ద చింతలపూడి సీఐ మల్లేశ్వరరావు, ఎస్ఐ కె.ప్రసాద్ బస్సులను తనిఖీచేసి 13 మందిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. చింతలపూడి కొత్తబస్టాండ్, ఫాతిమాపురం సెంటర్‌లో వాహనాలను తనిఖీ చేశారు.

● పోలవరం: మండలం నుంచి బయల్దేరుతున్న అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులను పోలీసులు వారిని పోలవరం పోలీస్ స్టేషన్‌ను తరలించారు.

● బుట్టాయగూడెం: చలో విజయవాడ కార్యక్రమానికి వెళుతున్న 11 మంది అంగన్వాడీలను ఏపీఆర్‌జేసీ సమీపంలో ఎస్సై కె.వెంకన్న అరెస్టుచేసి పోలీసులు స్టేషన్‌కు తరలించారు సాయంత్రం 5 గంటల తర్వాత విడుదల చేశారు.

● లింగపాలెం : వలసపల్లి చెక్‌పోస్టు వద్ద ఎస్ఐ పి.చెన్నారావు తన సిబ్బందితో పహారా ఏర్పాటు చేశారు. ఆటోలు, బస్సులలో అంగన్వాడీ సిబ్బందిని దింపి ధర్మాజీగూడెం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బుట్టాయిగూడెంకు చెందిన పలువురు అంగన్‌వాడీ వాహనాన్ని ఆపి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నాలుగు గంటల వరకు ఆహారం లేకపోవడంతో బుట్టాయిగూడెంకు చెందిన మహిళ ఫిట్స్‌తో పడిపోవడంతో సహచరులు సపర్యలు చేశారు. ఆమె కోలుకున్న తర్వాత వారిని బుట్టాయిగూడెం పంపించేశారు. తమను ఉదయం అరెస్టుచేసి సాయంత్రం వరకు కనీసం ఆహారం ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేశారని అంగన్‌వాడీలు వాపోయారు.

● పెదపాడు: అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులను కలపర్రు టోల్‌గేట్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. వాహనాల్లో ప్రయాణికుల వివరాలు సేకరించారు.

● పెదవేగి: పెదపాడు, పెదవేగి, దెందులూరు మండలాల్లో 215మంది కార్యకర్తలు, 202 మంది సహాయకులు సమ్మెలో పాల్గొన్నారు. పెదవేగి మండలంలో ఆరుగురు కార్యకర్తలు, ఐదుగురు సహాయకులు సోమవారం విధుల్లో చేరారని, మిగిలినవారిపై చర్యలు తీసుకుంటామని సీడీపీవో కె.విజయలక్ష్మి తెలిపారు.







ఏలూరులో అంగన్వాడీలకు మద్దతుగా నిలిచిన టీడీపీ, సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్ పార్టీ, ప్రజా సంఘాల నేతలు

ప్రభుత్వ వైఖరి దారుణం

రాజకీయ, ప్రజా సంఘాల నేతల ఆగ్రహం

పోలవరం, జనవరి 22: అంగన్వాడీల సమస్యపై ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ కార్యదర్శి పీఎల్ఎస్ కుమారి అన్నారు. సోమవారం కుమారి మాట్లాడుతూ విజయవాడలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న 2 వేల మంది అంగన్వాడీలను పోలీసులు అర్ధరాత్రి 2 గంటలకు అక్రమంగా అరెస్టు చేసి మంగినపూడి తరలించడం దారుణమన్నారు. చలిగాలిలో నేలపై ఉంచారని, ఉదయం అల్పాహారం కూడా ఇవ్వలేదన్నారు. పది కిలోమీటర్ల దూరం వరకూ కనీసం ఒక్క టిఫిన్ సెంటర్ కూడా లేదన్నారు. నిర్బంధించిన అంగన్వాడీలకు మంచి నీరు, అల్పాహారం లేకుండా మధ్యాహ్నం 3 గంటలకు చాలీ చాలని దద్దోజనం పెట్టారన్నారు. అంగన్వాడీల ఉసురు జగన్‌కు తప్పక తగులుతుందన్నారు. విధుల్లో చేరని అంగన్వాడీలను తొలగించాలని, విధుల్లోకి వచ్చిన సహాయకులకు వర్కర్లుగా పదోన్నతి ఇవ్వాలంటూ సీఎస్ కేఎస్ జవహర్ రెడ్డి ఆదేశించడం సిగ్గుచేటు అన్నారు. అంగన్వాడీలు, సహాయకులకు మధ్య చిచ్చు పెట్టి ఉద్యమాలను నీరుగార్చే ప్రయత్నం నీతిమాలిన చర్య అన్నారు. అంగన్వాడీలపై వైసీపీ ప్రభుత్వ అమానుష చర్యలు దారుణమని టీడీపీ నాయకుడు మంగిన కొండ ఆగ్రహం ఖండించారు.

● ఏలూరు టూటౌన్: ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలతో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బడేటి చంటి మాట్లాడారు. ప్రభుత్వం, పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సైకో ముఖ్యమంత్రి ఉద్యోగాల నుంచి తొలగిస్తామనడం దుర్మార్గమన్నారు. అంగన్వాడీలకు సమస్యలు పరిష్కారమయ్యే వరకు టీడీపీ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. అంగన్వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నిమ్మగడ్డ నరసింహ, కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ నెల 24న రాష్ట్రబంద్ నిర్వహిస్తామన్నారు. అంగన్వాడీల సమస్య లు పరిష్కరించకుండా విధుల్లో చేరకపోతే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని బెదిరించడాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ఖండించారు.

● జంగారెడ్డిగూడెం: అంగన్వాడీలను నిర్బంధించడాన్ని పలు ప్రజా సంఘాల నేతలు ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వ మొండి వైఖరి విడనాడాలన్నారు. సీపీఎం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం, జి.సూర్యకిరణ్, అందుగుల ప్రభాకరరావు, బొడ్డు రాంబాబు సంయుక్తంగా ప్రకటన విడుదల చేశారు. విజయవాడ వెళ్లిన వారిని, దారిలో, ఇళ్ల వద్ద వద్ద అంగాన్వాడీలను నిర్బంధించి పోలీస్ స్టేషన్లకు తరలించడంపై మండిపడ్డారు.

● బుట్టాయగూడెం: అంగన్వాడీలను అక్రమంగా అరెస్టు చేయడం అన్యాయమని ఏపీ గిరిజన సంఘం నాయకుడు తెల్లం రామకృష్ణ, పీవోడబ్ల్యూ నాయకురాలు కురసం లత అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీనే అమలు చేయాలని అంగన్వాడీలు కోరుతున్నారని ప్రభుత్వం స్పందించాలన్నారు. నిర్బంధాలతో ప్రజా ఉద్యమాలను ఆపలేదని స్పష్టం చేశారు.

● నిడమర్రు: ఉద్యమాన్ని ఆపడం దారణమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నారపల్లి రమణారావు అన్నారు. అంగన్వాడీలను పోలీసులు నిర్బంధించడం అప్రజాస్వామ్యమన్నారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా ఈ నెల 24వతేదీన రాష్ట్ర బంద్‌కు అందరూ మద్దతు పలకాలని కోరారు. చేబ్రోలులో అరెస్టు చేసిన అంగన్వాడీలను నిడమర్రు తరలించడం దారుణమన్నారు.

● చింతలపూడి: ఉద్యమాన్ని ఆపడం హక్కును హరించడమేనని సీపీఎం నాయకుడు ఆర్‌వి.సత్యనారాయణ అన్నారు. స్టేషన్‌లో ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలకు టీడీపీ నాయకలు అల్పాహారం అందించారు. మారుమూడి థామస్, అనీష్‌కుమార్ తదితరులు సంఘీభావం తెలిపారు.


కైకలూరులో అంగన్వాడీల నిర్బంధంపై టీడీపీ ఆందోళన


ముసునూరు పోలీస్‌స్టేషన్‌లో అంగన్‌వాడీల నిరసన


ఆగిరిపల్లి పోలీస్‌స్టేషన్‌లో చాట్రాయి అంగన్వాడీల ఆందోళన

జులుం

- అర్ధరాత్రి అరెస్టులు
- వేర్వేరు చోట్లకు తీసుకువెళ్లి నిర్బంధాలు
- తాగునీరు సైతం ఇవ్వని వైనం
- ఆదుకున్న టీడీపీ నాయకులు

అంగన్వాడీలపై ప్రభుత్వం కన్నెర్ర చేసింది. చలో విజయవాడ కార్యక్రమం నిర్వహించేందుకు తరలిన కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేసి వేర్వేరు చోట్ల పోలీస్ స్టేషన్లలో నిర్బంధించింది. వీరికి టీడీపీ నాయకులు అండగా నిలిచారు.

మండవల్లి, జనవరి 22: మండవల్లి మండలానికి చెందిన అంగన్వాడీ టీచర్లను వర్కర్స్‌ను మండవల్లి పోలీసులు అదుపులోకి తీసుకుని మండవల్లి పోలీసుస్టేషన్ కు తరలించారు. మరికొంతమందిని కైకలూరు సంఘంలోని సీఎన్నార్‌గార్డెన్‌కు తరలించారు. పోలీసుస్టేషన్‌లోను తమ సమస్యలు పరిశీలించాలని మండల అంగన్వాడీ టీచర్స్ అండ్ వర్కర్స్ నాయకులు వాణి, విజయలక్ష్మి, శ్రీదేవి ఆధ్వర్యంలో నినాదాలు చేశారు.

కలిదిండి : విజయవాడ వెళ్లకుండా తమను అడ్డుకుని పోలీసులు అదుపులోకి తీసుకోవడాన్ని నిరసిస్తూ సోమవారం కలిదిండి పోలీస్ స్టేషన్‌లో అంగన్‌వాడీలు నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ బెదిరింపులకు భయపడేది లేదని తమ సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. సీపీఎం నాయకులు శేషపు మహంకాళిరావు, వీరవల్లి భాస్కరరావు, కుడిపూడి శ్రీనివాస్, మహాలక్ష్మి, జోగి ఏసులు అంగన్‌వాడీలకు మద్దతు తెలిపారు.

ముదినేపల్లి: ముదినేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో బొమ్మినంపాడు, నారాయణపురం, పెదపాలపర్రు, దాకరం వద్ద చెక్ పోస్టులను ఏర్పాటు చేసి ఎస్ఐ వెంకట్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, సచివాలయాల మహిళా పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించి అంగన్‌వాడీ ఉద్యోగులను తాడేపల్లి వెళ్లకుండా నిలిపేశారు. వివిధ మండలాలకు చెందిన పలువురిని ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించి అక్కడి నుంచి కైకలూరు, కలిదిండి, పోలీస్ స్టేషన్లకు పంపించారు. ఆదివారం రాత్రికే విజయవాడ చేరుకున్న ముదినేపల్లి మండలానికి చెందిన అంగన్‌వాడీలను ధర్నా చౌక్ నుంచి మచిలీపట్నం తరలించారు. అనుమతి లేకుండా సీఎం నివాసం ముట్టడికి వెళ్తున్నారన్న కారణంగా ముదినేపల్లి, కృత్తివెన్ను మండలాలకు చెందిన 22 మంది అంగన్‌వాడీ ఉద్యోగులపై కేసులు నమోదు చేసినట్టు ఎస్ఐ వెంకట్ కుమార్ తెలిపారు.

ముసునూరు: ముసునూరు ఎస్ఐ ఎం.కుటుంబరావు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నుంచి గ్రామాల శివారుల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి, వాహనాల తనిఖీలు చేసి, అంగన్‌వాడీలు వెళ్ళే వాహనాలను అడ్డుకుని స్టేషన్‌కు తరలించారు. మండలంలోని పలు గ్రామాల అంగన్‌వాడీలతోపాటు కొయ్యల గూడెంకు చెందిన అంగన్‌వాడీలను పోలీసులు అదుపులోకి తీసుకోగా వారు స్టేషన్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, నిరసన వ్యక్తం చేశారు. వారిని సాయంత్రం విడుదల చేశారు. కాగా వీరికి భోజనం, తాగునీటి సదుపాయాలను రాష్ట్ర తెలుగుయువత ఆర్గనైజింగ్ కార్యదర్శి గద్దె రఘుబాబు సమకూర్చారు. టీడీపీ మండల అధ్యక్షుడు దేవినేని ఢలరాం, గద్దె బాబు, ఉప సర్పంచ్ తోట శ్రీనివాసరావులు అంగన్‌వాడీలకు మద్దతు తెలిపి ప్రభుత్వ తీరును ఖండించారు.

చాట్రాయి : మండలంలో ఎస్ఐ కేసీహెచ్ స్వామి, ఏఎస్ఐ గజపతిరావు సిబ్బందితో కలిసి విజయవాడ వెళ్ళే అన్ని రహదారుల్లో వాహనాలు తనిఖీ చేసి అంగన్వాడీలను అడ్డగించి పోలీస్టేషన్‌కు తరలించారు. పోలీసుల అదుపులో ఉన్న యూనియన్ లీడర్ విజయకు బీపీ తగ్గి పడిపోగా స్థానిక వైద్యుడితో చికిత్స చేయించారు. చాట్రాయి, చింతలపూడి మండలాలకు చెందిన సుమారు 60 మంది అంగన్వాడీలను ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలీస్టేషన్‌లో ఉంచి విడుదల చేశారు.

అండగా టీడీపీ నేతలు...

కైకలూరు: కైకలూరు సీఎన్నార్ గార్డెన్లో పోలీసుల నిర్బంధంలో ఉన్న అంగన్వాడీలు తమకు అండగా నిలవాలని టీడీపీ నేతలను కోరారు. పోలీసుల నిర్బంధంలో ఉన్న అంగన్వాడీలను సందర్శించేందుకు వెళ్లిన టీడీపీ నాయకులకు పలువురు అంగన్వాడీలు తమ సమస్యలను చంద్రబాబు నాయుడు తెలపాలని, మద్దతు ఇవ్వాలని కోరారు. వీరికి టీడీపీ నేతలు తమ సొంత ఖర్చులతో కూల్‌డ్రింక్స్‌ను సరఫరా చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాధరాజు, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు విజయలక్ష్మి, టీడీపీ నాయకులు కొడాలి వినోద్, వేములపల్లి కారుణ్య, పోలవరపు లక్ష్మీరాణి, తెంటు వెంకట రమణ, గంగుల శ్రీదేవి, ఎండీ ఉస్మాన్, బాషీద్ తదితరులు వీరికి మద్దతు తెలిపారు.

‘పరువుపోతుందనే అక్రమ నిర్బంధం’



నూజివీడు టౌన్, జనవరి 22: అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేని అసమర్థ ముఖ్యమంత్రి తన నివాసం వద్ద అంగన్‌వాడీలు ధర్నాకు దిగితే పరువు పోతుందని భయపడి వారిని అక్రమంగా నిర్బంధించి పలు ప్రాంతాలకు తరలించటం హేయమని నూజివీడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. నూజివీడు సారథి ఇంజినీరింగ్ కళాశాలకు అంగన్‌వాడీలను పోలీసులు తరలించగా, కళాశాల గేటువద్ద ఆయన అంగన్‌వాడీలకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలోకి వెళ్ళేందుకు ముద్దరబోయిన ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. అదే సమయంలో కళాశాలకు వచ్చిన బస్సులో అంగన్‌వాడీలతో మాట్లాడేందుకు సైతం పోలీసులు నిరాకరించడంతో అంగన్‌వాడీలు బయటకు రావాలని ఆయన కోరారు. దీంతో పోలీసులు బస్సులో నుంచి అంగన్‌వాడీలు దిగేందుకు అంగీకరించలేదు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అంగన్‌వాడీలకు కనీసం మంచినీరు కూడా ఇవ్వకపోవడంపై పోలీసులు మానవత్వాన్ని మరిచిపోయారంటూ ముద్దరబోయిన ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటర్ బాటిళ్ళు తెప్పించి బస్సులోని అంగన్‌వాడీలకు అందించారు. నూజివీడు మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, టీడీపీ పట్టణ ఉపాధ్యక్షుడు తిరుమలశెట్టి ప్రదీప్‌కుమార్, ప్రధాన కార్యదర్శి నాగరాజు, ఏలూరు పార్లమెంట్ అంగన్‌వాడీ, డ్వాక్రా మహిళా అధ్యక్షురాలు కొమ్మన విజయ, సయ్యద్ నజీమున్నీసా, రాష్ట్ర బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి తలపంటి రాజశేఖర్, తెలుగు యువత నాయకులు గోగినేని మధు, కౌన్సిలర్ దాసరి స్వామి, మాజీ కౌన్సిలర్ పాదం సత్యనారాయణ, కందిపల్లి చెన్నారావు తదితరులు అంగన్‌వాడీలకు సంఘీభావం తెలిపారు.

అరెస్టు దుర్మార్గం: చిన్నం

నూజివీడు: అంగన్‌వాడీలను అరెస్ట్ దుర్మార్గమని నూజివీడు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చిన్నం రామకోటయ్య అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సమ్మెబాట పట్టిన అంగన్‌వాడీ కార్యకర్తలను విధుల నుంచి తొలగిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను వెంటనే ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

గిడుగుకు ఘన నివాళి

ముదినేపల్లి, జనవరి 22 : తెలుగువాడుక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి వర్ధంతి సందర్భంగా సోమవారం ముదినేపల్లి మండలం పెయ్యేరు పాఠశాలలో హెచ్ఎం బేతాళ రాజేంద్ర ప్రసాద్, ఉపాధ్యాయుడు చక్రధర్, విద్యార్థులు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఏ పరీక్షల్లో తెలుగు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన ఒకటి నుంచి ఐదవ తరగతి విద్యార్థులకు రాజేంద్ర ప్రసాద్ బహుమతులు అందజేశారు.

యోగా శిక్షకుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఆగిరిపల్లి, జనవరి 22: ప్రధాన మంత్రి ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా ఆగిరిపల్లిలోని ఉచిత హోమియో వైద్యశాలకు పార్ట్ టైమ్ యోగా శిక్షకులు కావాలని వైద్య అధికారిణి డాక్టర్ రజిత తెలిపారు. ఒక పురుష, ఒక స్త్రీ శిక్షకులు అవసరమని, యోగాలో డిగ్రీ, పీజీ చేసిన వారు అర్హులన్నారు. ఈ నెల 24వ తేదీ మధ్యాహ్నం ఒంటిగంట లోగా దరఖాస్తులు అందించాలని, మరిన్ని వివరాలకు 96760 78795 సంప్రదించాలన్నారు.

విద్యార్థులు అప్‌డేట్ కావాలి

నూజివీడు టౌన్, జనవరి 22: డేటా సైన్స్ అండ్ టెక్నాలజీపై అవగాహన కలిగి ఉండాలని ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీ డాక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. ఇండో-యూరో సింక్రనైజేషన్ కార్యక్రమంలో భాగంగా ఆయన నూజివీడు ట్రిపుల్ ఐటీని సందర్శించారు. ఈ సందర్భంగా అడ్వాన్సుడు డేటా సైన్స్ క్లస్టర్‌పై ధ్రువీకరణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి విద్యార్థులతో మాట్లాడుతూ మల్టీ డిసిప్లినరీ అప్రోచ్‌పై ప్రధానంగా దృష్టి సారించాలన్నారు. నేటి విద్యార్థులు రేపటి టెక్ లీడర్లుగా ఉంటారని, అందువల్ల ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవ్వాలన్నారు. సీఎస్ఈ హెచ్‌వోడి డాక్టర్ చిరంజీవి, ఫైనాన్స్ ఆఫీసర్ నాగార్జునా దేవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు లోకేశ్ పుట్టినరోజు.. ఉచిత వైద్య శిబిరం

కైకలూరు, జనవరి 22: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం కైకలూరులో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి పీజేఎస్ మాల్యాద్రి తెలిపారు. టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ ప్రారంభిస్తారని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు జనార్దనవరంలో జయహో బీసీ

చాట్రాయి, జనవరి 22: మండలంలోని జనార్దనవరంలో 23వ తేదీ సాయంత్రం 4 గంటలకు జయహో బీసీ సదస్సు నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మరిడి చిట్టిబాబు, పలగాని దుర్గారావు తెలిపారు. ముఖ్య అతిథులుగా బందరు ఎంపీ కొనకళ్ళ నారాయణ, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, జిల్లా బీసీ నాయకులు హాజరవుతున్నారని మండలంలో అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆడుదాం ఆంధ్రా విజయవంతం చేయండి

నూజివీడు, జనవరి 22: నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను విజయవంతం చేసేందుకు వ్యాయామోపాధ్యాయులు కృషి చేయాలని నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజీంద్రన్ అన్నారు. నూజివీడులో వ్యాయామోపాధ్యాయులు, ఇతర అధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించి మాట్లాడుతూ ఏయే క్రీడాపోటీలు ఎక్కడెక్కడ నిర్వహించాలో ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు. ఈ నెల 24 నుంచి డీఏఆర్ కళాశాలలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలు జరుగుతాయని, క్రికెట్ పోటీలను ఎంజీజీ లేఅవుట్‌లో నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు.

నూజివీడు సెబ్ సీఐగా వెంకట రమణ



నూజివీడు టౌన్, జనవరి 22: నూజివీడు సెబ్ సీఐగా పి.వెంకటరమణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు నూజివీడు ఎస్ఈబీ సీఐగా పనిచేసిన టి.గోపాలకృష్ణ రాజమహేంద్రవరం బదిలీకాగా ఆయన స్థానంలో రాజమహేంద్రవరం నార్త్ డివిజన్‌లో పనిచేసిన వెంకటరమణను ఇక్కడకు బదిలీ చేయడంతో ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

కైకలూరు ఇన్‌స్పెక్టర్‌గా సుధ



కైకలూరు, జనవరి 22: కైకలూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా డి. సుధ బాధ్యతలు చేపట్టారు. ఈమె తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి సెబ్ స్టేషన్ నుంచి కైకలూరు బదిలీ అయ్యారు. కైకలూరులో పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్ రాంబాబు బదిలీపై రాజమహేంద్రవరం బదిలీపై వెళ్లారు. బదిలీపై వచ్చిన ఇన్‌స్పెక్టర్ సుధకు ఎస్సై ఎండీ జైనులుద్దీన్, సిబ్బంది స్వాగతం పలికి సత్కరించారు.

స్పందనకు 11 అర్జీలు

నూజివీడు టౌన్, జనవరి 22: నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 11 అర్జీలు దాఖలైనట్టు సబ్ కలెక్టర్ ఆదర్శ్‌రాజీంద్రన్ తెలిపారు. ఈ సందర్భంగా నూజివీడు బాపూనగర్‌కు చెందిన ఆకుల కృష్ణవేణి, ముసునూరుకు చెందిన మానికల పంగిడేశ్వరరావు, ఆగిరిపల్లికి చెందిన సందిపాము నీలాంబరం, అడవి నెక్కలంకు చెందిన పమిడిముక్కల సుందరమ్మ, ఆగిరిపల్లికి చెందిన విన్నపాల లక్ష్మీనారాయణ, వడ్లమానుకు చెందిన రెడ్డి కుటుంబరావు ఆయా ప్రాంతాల్లో భూసేకరణకు సంబంధించి అభ్యంతరాలను తెలుపుతూ అర్జీలు అందజేశారు. రావిచర్లకు చెందిన లావు శ్రీధర్‌కుమార్, చింతలపూడికి చెందిన తాడిగడప మాణిక్యాలరావు, గొల్లపల్లికి చెందిన బోనాల నాగేంద్రబాబు రికార్డుల పరంగా తమ భూములను సర్వే చేసి అప్పగించాలని అర్జీలు ఇచ్చారు.

ఘనంగా త్యాగరాజస్వామి ఉత్సవాలు

ముదినేపల్లి రూరల్, జనవరి 22: మూడు రోజులుగా సింగరాయపాలెంలో నిర్వహిస్తున్న త్యాగరాజస్వామి ఉత్సవాల్లో భాగంగా సోమవారం చివరిరోజు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులకు భారీ అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఉత్సవాలకు టీడీపీ నాయకులు పెనుమత్స వెంకటరాజు, కొత్తూరు విఠల్, చల్లగుండ్ల శోభనాద్రి చౌదరి విరాళాలు అందజేశారు.




పెదలంక రామాలయంలో సీతారాముల కళ్యాణం.. చనుబండలో ఊరేగింపు.. అగ్రహారంలో ప్రతిష్ఠించనున్న ప్రజలు

అంతా రామమయం



నూజివీడు, చాట్రాయిలో కరసేవకులను సన్మానిస్తున్న దృశ్యం

కైకలూరు, జనవరి 22: జై శ్రీరామ్ అంటూ భక్తుల రామనామ స్మరణతో కైకలూరు మార్మోగింది. అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకొని గ్రామాల్లోని రామాలయాల వద్ద విశేష పూజలను నిర్వహించి అన్నసమారాధనలు నిర్వహించారు. కైకలూరులో శ్రీరాముని శోభయాత్రను ఘనంగా నిర్వహించారు. లోకుముడి దత్తాశ్రమం నుంచి బైక్‌లపై భక్తులు వేలాది మంది జై శ్రీరామ్ అంటూ కైకలూరులోని జాతీయ రహదారి వెంబడి గోనెపాడు వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. శోభయాత్రకు వేలాదిమంది భక్తులు తరలిరావడంతో రహదారులు కిక్కిరిసిపోయాయి. కైకలూరు మండలం వరహాపట్నం శివారు అగ్రహారంలో రామాలయం పునఃనిర్మాణం సందర్భంగా సీతారాముల విగ్రహాల ఊరేగింపును వైభవంగా నిర్వహించారు. త్వరలో ఈ విగ్రహ ప్రతిష్ఠ నిర్వహిస్తామని కమిటీ తెలిపింది.

చాట్రాయి: మండలంలోని అన్ని రామాలయాల్లో ప్రత్యేక పూజలు, ఏకాహాలు జరిగాయి. లోగిళ్ళను మామిడి తోరణాలతో అలంకరించారు. చాట్రాయి, ద్విచక్రవాహనాలతో భారీ శోభాయాత్రలు నిర్వహించారు. చాట్రాయి రామాలయం వద్ద ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేసి అయోధ్య రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని భక్తులు ప్రత్యక్షంగా తిలకించే ఏర్పాటు చేశారు. అపరభద్రాద్రి చనుబండ కోదండ రామాలయంలో, కోనేరు అభయ ఆంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపి భారీ అన్నదానం నిర్వహించారు. కోదండరాముడిని పల్లకిలో ఊరేగించారు. రాత్రి ప్రతి గృహంలో దీపాలు వెలిగించి శ్రీరాముడిపై భక్తిని చాటుకున్నారు.

నూజివీడు టౌన్: అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని నూజివీడు పట్టణం, మండలంలో రామనామం మార్మోగింది. గొల్లపల్లి రఘునాథస్వామి ఆలయం నుంచి శోభయాత్ర వైభవంగా సాగింది. నూజివీడు సూర్యరామమందిరం, కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో మహా రామ నామ సంకీర్తన జరిగింది. నూజివీడు కొప్పుల వెలమపేట రామాలయంలో దీపోత్సవం నిర్వహించారు. కందిపల్లి చెన్నారావు, పల్లి నాగరాజు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: అయోధ్యలో బాలరాముని ప్రతిష్ఠ సందర్భంగా ఆగిరిపల్లి కోదండ రామాలయంలో స్వామివారి కల్యాణం వైభవంగా జరిగింది. పది జంటలు స్వామివారికి కల్యాణం జరిపించారు. కల్యాణం అనంతరం ఆగిరిపల్లి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భారీ కార్ల ర్యాలీని భక్తుల జయజయ ధ్వానాల మధ్య నిర్వహించారు. నరసింగపాలెంలో కోదండరామ యూత్ సీతారాముల ఉత్సవ విగ్రహాలను ఘనంగా ఊరేగించారు.

కలిదిండి: మండలంలోని రామాలయాల్లో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. బైక్ ర్యాలీ జరిగింది. ఆలయాల వద్ద టీవీలు ఏర్పాటు చేసి అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలను వీక్షించారు. పెదలంక రామాలయంలో కల్యాణం నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు.

ముదినేపల్లి: వీహెచ్‌పీ మండల శాఖ ఆధ్వర్యంలో రామభక్తులు బైక్ ర్యాలీ నిర్వహించారు. శ్రీహరిపురం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, గ్రూపు దేవాలయాల ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం ముదినేపల్లి పెద రామాలయంలో వత్తుమిల్లి ప్రసాద్ దంపతులతో పాటు పలువురు సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. సాయంత్రం ముదినేపల్లిలో రథయాత్ర నిర్వహించారు.

మండవల్లి: అయోధ్యలో రామప్రతిష్ఠ సందర్భంగా హిందూ ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో మండవల్లిలో సోమవారం ప్రత్యేక పూజలు, మండవల్లి ప్రధాన వీధుల్లో జైశ్రీరామ్ అంటూ నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ప్రధాన కూడళ్లల్లో సిమెంటు బెంచిలీ ఏర్పాటు చేశారు. గ్రామంలో జెండాలను పంపిణీ చేశారు. ఏకాహం నిర్వహించారు. మండవల్లి శివాలయం ప్రధాన అర్చకులు గూడూరు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి.

ముదినేపల్లి రూరల్: అయోధ్యలో సోమవారం నిర్వహించిన బాలరాముడు విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని సింగరాయపాలెంలో వేంచేసి ఉన్న శ్రీ బావాజీ మఠంలో శ్రీకోదండరామ స్వామి దేవస్థానం ఆవరణలో భక్తుల సౌకర్యార్థం ఎన్‌ఆర్‌ఐలు సహకారంతో ప్రత్యక్ష ప్రసారం చేయగా భక్తులంతా వీక్షించారు. జడ్పీటీసీ మాజీ సభ్యులు పాతూరి సీతారామాంజనేయులు, కొత్తూరు విఠల్, పర్సా ఏడుకొండలు, సర్పంచ్ పర్సా విశ్వేశ్వరరావు తదితరులు హాజరయ్యారు.

కర సేవకులకు సన్మానం

నూజివీడు టౌన్: రామభక్తుల ఐదు దశాబ్దాల పోరాటంతో బాలరాముడి విగ్రహం ఆవిష్కృతమై ప్రపంచ వ్యాప్తంగా రామమయం అయిందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి (తపనా చౌదరి) అన్నారు. నూజివీడు డీఏఆర్ కళాశాలలో హనుమాన్ సేన ఆధ్వర్యంలో అయోధ్య బాలరాముని ప్రాణప్రతిష్ఠను ఎల్‌ఈడి స్క్రీన్‌లతో ప్రత్యక్ష ప్రసారం ఏర్పాటు చేశారు. తపనా చౌదరి, సినీగేయ రచయిత అనంత్ శ్రీరామ్ హాజరయ్యారు. పెద్దసంఖ్యలో రామభక్తులు బాలరాముని ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని తిలకించారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. శ్రీరామ శోభాయాత్ర వైభవంగా జరిగింది. రామమందిర నిర్మాణానికి కరసేవలో పాల్గొన్న నూజివీడుకు చెందిన కరసేవకులు ఆవారపు సత్యనారాయణ, వెలివెల శోభనాచలం, సుంకర శ్రీనివాసరావు తదితరులను తపనా చౌదరి, అనంతశ్రీరామ్ సత్కరించారు. చోడిశెట్టి పవన్‌సూర్య, దోసపాటి భాస్కర్‌రావు, బీజేపీ నూజివీడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ రంగారావు, నూజివీడు మండల అధ్యక్షులు అప్పారావు, కామేష్ తదితరులు పాల్గొన్నారు.

చాట్రాయి: అయోధ్యలో 1990, 1992 సంవత్సరాలలో జరిగిన కరసేవలో పాల్గొన్న 6 గురు కరసేవకులను చాట్రాయి రామాలయంలో చైర్మన్ దామెర బుచ్చిబాబు, భక్తబృందం సభ్యులు ఘనంగా సన్మానించారు. కరసేవకులు గడ్డం సంజీవరెడ్డి, తోటకూర వెంకటేశ్వరరావు, ఇజ్జిగిరి రాధాకృష్ణ, ఆదిమూలం నాగమోహనశర్మ, పోతురెడ్డిపల్లి చెన్నారావు, గొల్కొండ చెన్నారావులను సన్మానించి పూలాభిషేకం చేశారు. మృతి చెందిన కరసేవకులు ఆదిమూలం సుబ్బారావు, పాలడుగు మధుసూదనరావు, గోల్కొండ సుబ్బారావులకు స్వర్గలోక ప్రాప్తి కలగాలని శ్రీరాముడిని ప్రార్థించారు.


ఆగిరిపల్లి రామాలయంలో స్వామివారి కల్యాణం..



చాట్రాయి, కైకలూరుల్లో శోభాయాత్ర

552 మంది అంగన్వాడీ కార్యకర్తల తొలగింపు

కైకలూరు, జనవరి 22: కైకలూరు నియోజకవర్గంలో అంగన్వాడీ టీచర్లు, ఆయాలు 552 మందిని విధుల నుంచి తొలగిస్తున్నట్లు సీడీపీవో ఆనంద్ సోమవారం తెలిపారు. ప్రభుత్వ హెచ్చరికలను పట్టించుకోకుండా అంగన్వాడీలు నిరవధిక సమ్మెకు దిగడంతో కలెక్టర్ ఆదేశాలతో తొలగించామన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని 586 మంది అంగన్వాడీ కార్యకర్తలుండగా వారిలో 279 మంది టీచర్లు, 273 మంది ఆయాలుగా పనిచేస్తున్నారని, వీరిలో 34 మంది సోమవారం విధుల్లో చేరారని మిగిలిన 552 మందిని తొలగించామన్నారు.

నూజివీడు పరిధిలో 84 మంది విధుల్లో చేరిక

నూజివీడు టౌన్, జనవరి 22: నూజివీడు సీడీపీవో పరిధిలో మొత్తం 84 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు విధుల్లో చేరినట్టు నూజివీడు సీడీపీవో షేక్ నూరానీ తెలిపారు. నూజివీడు సీడీపీవో కార్యాలయ పరిధిలో మొత్తం 319 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, నూజివీడు మండలంలో 25మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, 22మంది సహాయకులు, ఆగిరిపల్లి మండలంలో 13మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, 14మంది సహాయకులు, ముసునూరులో ముగ్గురు అంగన్‌వాడీ కార్యకర్తలు, చాట్రాయిలో నలుగురు కార్యకర్తలు,ముగ్గురు సహాయకులు విధుల్లో చేరారని ఆమె తెలిపారు.

బియ్యం పంపిణీకి చర్యలు

ముదినేపల్లి, జనవరి 22 : ముదినేపల్లి మండలం బొమ్మినంపాడులో ఈ నెలలో పంపిణీ కాకుండా మిగిలిపోయిన బియ్యం లబ్ధిదారులకు ఉచిత బియ్యం పంపిణీకి చర్యలు తీసుకుంటున్నట్లు పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి ఆర్.సత్యనారాయణరాజు తెలిపారు. 180 కుటుంబాలకు బియ్యం లేనట్లేనా శీర్షికన ఈ నెల 21న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై స్పందించిన ఆయన సోమవారం ముదినేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కె.శ్రీనివాస్, పౌర సరఫరాల శాఖ డీటీ స్వర్ణలత, చౌక డిపోల డీలర్లు, గ్రామస్థులతో బొమ్మినంపాడులో రేషన్ పంపిణీ పూర్తి కానీ అంశాలపై చర్చించారు. ఎండియూ వాహన ఆపరేటర్ సక్రమంగా పంపిణీ చేయకపోవటం వల్లే 188 కుటుంబాల లబ్ధిదారులకు బియ్యం అందలేదన్న విషయాన్ని గుర్తించినట్లు డీఎస్ఓ తెలిపారు. ఎండీయూ వాహనం ఆపరేటర్‌ను తొలగిస్తున్నామని, మిగిలిన లబ్ధిదారులకు బియ్యం ఇచ్చేలా ఉన్నతాధికారులతో మాట్లాడుతున్నట్లు డీఎస్‌వో సత్యనారాయణ రాజు తెలిపారు.

కామినేని ఆత్మీయ సమావేశం

ముదినేపల్లి రూరల్, జనవరి 22:మండలంలోని కోడూరు, చిన్నపాలపర్రు గ్రామాల్లో సోమవారం మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ గ్రామస్థులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తాను ఎమ్మెల్యేగా గ్రామాల్లో ఏ విధమైన అభివృద్ధి పనులు చేసిందీ వివరించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాల్లో సమస్యలను ఎప్పటికప్పుడు నాయకులు ద్వారా తెలుసుకుని గ్రామాలను అభివృద్ధి చేశానన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, నాయకులు కొత్తూరు విఠల్, దావు నాగరాజు, బొప్పన సుందరామయ్య శివాజీ తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ కార్డుల పంపిణీ

ఆగిరిపల్లి, జనవరి 22: మండలంలోని అడవి నెక్కలం, సగ్గూరు, నెక్కలం గొల్లగూడెం, నరసింగపాలెం గ్రామాల్లో వికసిత్‌భారత్ సంకల్పయాత్ర జరిగింది. ఈవో చిట్టిపోతుల శేఖర్, ఎంఈవో కె.ఆనంద్‌కుమార్, ఏఈఈ పి.సత్యనారాయణ, స్థానిక గ్యాస్ కంపెనీ అధినేత పాలడుగు శ్రీనివాస్ పాల్గొని ప్రధాన మంత్రి ఉజ్వల ఉచిత గ్యాస్ కార్డులు, ఆయుష్మాన్ భారత్ హెల్త్‌కార్డులు పంపిణీ చేశారు.

ఉజ్వల పథకంతో గ్యాస్ కనెక్షన్లు

మండవల్లి, జనవరి 22: కేంద్ర ప్రభుత్వ ఉజ్వల పథకం ద్వారా మహిళలకు గ్యాస్ కనెక్షన్లు ఇస్తున్నామని, అర్హులు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ కిసాన్‌మోర్చ జిల్లా అధ్యక్షుడు కీర్తి వెంకట రాంప్రసాద్ కోరారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా గ్యాస్ కనెక్షన్ లేని మహిళలకు సోమవారం మండవల్లిలోని ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ వద్ద గ్యాస్ కనెక్షన్లు అందించేందుకు కీర్తి ఆధ్వర్యంలో నమోదు చేయించారు.